



ఆదివారం ప్రత్యేకం

సుడిగుండాలు!



ఇటీవల వరదలకు మునిగిన గొల్లప్రోలు జాతీయ రహదారి

గోదావరి.. పేరు వినగానే ఒక మనోహర దృశ్యం కళ్ల ముందు ప్రత్యక్షమవుతుంది. పేరులోనే గోదావరి.. కనుచూపు మేర కనిపించే గోదారి అందాలు.. పరవళ్లు తొక్కుతూ పరుగులుతీసే ప్రవాహ వేగం.. మంద్రంగా సాగిపోయే మత్స్యకారుల నాటు పడవలు, రాజమండ్రి రోడ్ కం రైలు బ్రిడ్జి, ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ.. ఇలా ఒక్కొక్కటి ఓ దృశ్యకావ్యంలా కదలాడుతుంటాయి. అందుకే గోదావరిపై ఎన్నెన్నో సినిమాలు, పాటలు, కవితలు, కావ్యాలు.. ఉప్పొంగే గోదారంటే ఓ పరవశం..!

ఎన్నెన్నో అందాలు గోదావరి జిల్లాల సొంతం. ఎగువున గోదావరిని ఆనుకుని ఆకుపచ్చ లోకంలా దట్టమైన అడవులు, ఏజెన్సీ అందాలు... మరోవైపు సుదీర్ఘమైన సముద్రతీరం.. అలరించే బీచ్‌లు.. చేపల కోసం వేటకెళ్లే జాలర్లు.. ప్రతీదీ సుందర దృశ్యమే. దిగువున పచ్చని కొబ్బరి వనాల కోనసీమ, గలగలా పారుతున్న పంట కాల్వలు, భూమి తల్లి పచ్చని చీరకట్టినట్టుగా పైరుపంటలు.. లోగిలి ఇళ్లు.. పొలాల మధ్య డాబాలు.. కోడిపందాలు.. పండుగల సందళ్లు.. అతిథి మర్యాదలు.. అబ్బో, గోదారోళ్లంటే అదృష్టవంతులే.. అక్కడ ఉండాలంటే పెట్టిపుట్టాలని అనుకోవడం ఓ మధురానుభూతి..!

కానీ...

గోదావరి జీవనం అనుకున్నంత హాయి కాదు. సంతోషాల తీరం కాదు.. నిత్యం కనిపించని శత్రువు ప్రకృతి వైపరీత్యాలతో పోరాడాలి. ఎటుచూసినా నీళ్లు.. నీళ్లు.. ఇక వీళ్లకేం లోటు.. అదృష్టవంతులు.. ఇలాంటి అభిప్రాయమే అందరిదీ. కానీ సినిమాల్లో గోదావరిని చూపించినంత అందంగా నిజజీవితం ఉండదు. నిత్యం ఆటుపోట్లు.. వైపరీత్యాలు.. చెప్పాలంటే ప్రకృతి కనికరం మీద సాగే జీవనం.. క్షణాల్లో తల్లకిందులైపోయే బతుకులు.. గోదావరి జీవనానికి ఇది రెండోవైపు...

- నీళ్లే ఆధారం.. నీళ్లే శాపం
- ప్రకృతి కరుణతోనే జీవనం
- లేదంటే నష్టాల ఊబిలోకి
- వర్షాలతో అస్తవ్యస్తం
- రైతుల జీవనం ఎదురీతే
- జాలర్ల బతుకులూ అంతే
- ఈ ఏడాది వరుస తుఫాన్లు, వరదలు
- ఏటా కోట్లలో నష్టాలు
- ఇటు వర్షాల నష్టం.. గోదావరి ముంపు కష్టం
- అటు సముద్రం అల్లకల్లోలంతో గుండె'కోత'
- ఇదీ గోదావరి ప్రాంత ప్రజల జీవన చిత్రం

(కాకినాడ/రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

తూర్పు గోదావరి జిల్లా అంటే ప్రశాంతతకు.. ప్రకృతి అందాలకు.. పరవశించిపోయేంతటి పచ్చదనానికి నిలువెత్తు చిరునామా.. ఒకపక్క అందాల గోదావరి... మరోపక్క కవ్వించే సాగరతీరం.. భూమికి పచ్చని రంగేసినట్టు నలుదిక్కులా కనిపించే వరి పైరులు.. అందాల తీరంపై కదలాడే పడవలు.. మత్స్యకారుల జీవన సిత్రాలు. ఇలా ఒకటేంటి ఉమ్మడి తూర్పుగోదావరికి దేవుడు ప్రసాదించిన అందాలను వర్ణించడానికి మాటలు చాలవు.. అయితే కనువిందు చేసే ఈ అందాల ప్రాంతాన్ని ప్రకృతి పగబట్టింది. గత దశాబ్దకాలంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అనేక ఆటుపోట్లకు గురైంది. ఈ ఏడాది సంగతి అయితే ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. వర్షాలు.. తుఫాన్లు.. వరదలు కల్లోలం సృష్టిస్తున్నాయి. ఇప్పటివరకు అలరించే అందాల జిల్లాలో ప్రకృతి వైపరీత్యాల సమయంలో ఒకపక్క గోదావరి ఉగ్రరూపం.. మరోపక్క సాగరతీరం అల్లకల్లోలం... పచ్చటి పైర్ల కకావికలం.. అన్నదాతల ఆందోళనలు.. కన్నీళ్లు.. మత్స్యకారుల ఆకలికేకలు చెప్పాలంటే.. ప్రకృతి విలయతాండవం చేస్తోంది.

జీవనం అతలాకుతలం

గోదావరి జిల్లాల ప్రజలంటే అందరి దృష్టిలో అదృష్టవంతులుగా కనిపిస్తారు. వాస్తవ జీవితం ఇక్కడ పుట్టి ఇక్కడ జీవించిన వాళ్లకే అర్థమవుతుంది. తుఫాన్ల రాజ్యంలో ప్రతిఏటా నరకమే. గోదావరి వరదల వెనుక ఎంతో నష్టం. మరెంతో కష్టం.. రెండు మూడు దశాబ్దాల కిందట వర్షాకాలం వచ్చిందంటే లక్షలాది మంది సామాన్య ప్రజలు నివసించడానికి కూడా చోటుండేది కాదు. తినడానికి తిండి కూడా ఉండేది కాదు. ఏదొక సురక్షిత ప్రాంతానికి వలస వెళ్లి ఆ గడ్డు రోజుల నుంచి గట్టెక్కేవాళ్లు. ఇప్పుడు ఆ పరిస్థితి తగ్గింది. శాశ్వత ఇళ్ల నిర్మాణాలతో తుఫాన్ల నుంచి ప్రాణగండం లేకుండా బతుకుజీవుడా అని కోలుకొంటున్నారు. కానీ సముద్రతీరంలో 1996లో తుఫాను సమయంలో జరిగిన ప్రాణనష్టం, ఆస్తినష్టం ఒక విషాద ఘట్టం. అలాగే 1986లో గోదావరి వరదల సమయంలో జరిగిన నష్టం గోదావరి జిల్లాలను అతలాకుతలం చేసింది. తర్వాత కూడా ఏటా సంభవిస్తున్న తుఫాన్ల వల్ల సముద్రతీరంలో వేలాది మంది షెల్టర్లలోనో, సురక్షిత ప్రాంతంలోనో తలదాచుకోవాల్సి వస్తోంది. తీవ్రమైన ఈదురుగాలులు, వర్షాలకు అపారమైన నష్టం జరుగుతూనే ఉంది. ఇటు చూస్తే ఏటా జూలై, ఆగస్టు మాసాల్లో సంభవించే గోదావరి వరదలకు వేలాది మంది ముంపు బాధితులుగా రోడ్డున పడుతున్నారు. ఈ ఏడాది సెప్టెంబరు, అక్టోబరులో కూడా గోదావరి వరదలు లంక గ్రామాలను అతలాకుతలం చేశాయి.

ఛిద్రమవుతున్న రైతు జీవన చిత్రం

గోదావరి జిల్లాల్లో వర్షాలు, వరదలు ఏటేటా నరకం చూపిస్తున్నాయి. ప్రధానంగా అన్నదాతల జీవనం ఛిద్రమవుతోంది. కొన్నేళ్లుగా ఏటా అన్నిరకాల పంటలు తుఫాన్ల నేపథ్యంలో కురిసే భారీ వర్షాలకో, గోదావరి వరదలకో ముంపు బారిన పడుతున్నాయి. వరి రైతులైతే నాట్ల దశ నుంచి ధాన్యం పట్టుబడి జరిగే లోపు ఏదో ఒక దశలో ప్రకృతి విపత్తుకు బలవుతున్నాడు. పెట్టిన పెట్టుబడి నీటిపాలవుతోంది. కన్నీళ్లు మిగులుతున్నాయి. ఒకప్పుడు ఊళ్లో దర్పంగా తిరిగే రైతన్న ఇప్పుడు దిగులుతో రోజులు వెళ్లదీస్తున్నాడు. ఇక్కడ వరి తర్వాత అరటి, పొగాకు, చెరకు, అపరాల పంటలు, మొక్కజొన్న, కూరగాయలు వంటివి ఎక్కువగా సాగు చేస్తారు.



గొల్లప్రోలులో ముంపు నష్టాలు (ఫైల్‌ఫొటో)

భారీ వర్షాల వల్ల ప్రతిఏటా పంటలు నాశనం అవుతూనే ఉన్నాయి. తుఫాను వస్తోందని, భారీ వర్షాలు వస్తున్నాయని ముందస్తు హెచ్చరికలున్నా పొలంలో పరిస్థితిని ఎవరూ మార్చలేరు. ప్రస్తుతం పంటలు కోత దశలో ఉన్నాయంటే కోత కోయడం మానేస్తారు అంతే. కానీ భారీవర్షాలు, తుఫాన్ వల్ల నష్టం జరగక తప్పదు. ఇక మాసూలు దశలో నష్టం జరిగితే రైతు అప్పులపాలే.

పంట నష్టాలు.. వందల కోట్లలో..

అయిదారేళ్ల నుంచి ఏటా పంట నష్టాలు తీవ్రస్థాయిలోనే ఉంటున్నాయి. పంటల బీమా పరిహారం ఉన్నా అది కంటితుడుపు చర్య మాత్రమే. పంట నష్టాలు ఏటా వందల కోట్లలో ఉంటే పరిహారం మాత్రం పదుల కోట్లలో ఉంటుంది. ఒక రైతు ఖరీఫ్ మాసూలు సమయంలో వర్షాలకు పంట నష్టం జరిగింది అనుకోండి. ఈ కష్టం నుంచి బయటపడడం, మిగిలినదాన్ని ఒడ్డుకు చేర్చి అమ్ముకోవడం నరకం లాంటిది. అదే సమయంలో రబీకీ కూడా సన్నద్ధం కావాలి. అంటే ఒకే సమయంలో అవిశ్రాంతంగా కష్టపడాలి. నష్టమంతా అప్పుల్లోకి మార్చి కొత్త పంట కోసం సన్నాహాలు చేసుకోవాలి. ఇంత కష్టం మరెవరికీ ఉండదని వేరే చెప్పాల్సిన పనిలేదు. అధిక పెట్టుబడులతో కూరగాయల పంటలు, అరటి వేస్తే సర్వనాశనమవుతాయి. ఒక్క రూపాయి కూడా చేతికి రాదు. అప్పుల ఊబిలోకి మెల్లగా జారిపోవాల్సిందే. ఉదాహరణకు తూర్పుగోదావరి జిల్లాలో 2023 మార్చిలో భారీ వర్షాల వల్ల 97.554 హెక్టార్లలో నష్టం. 2023 ఏప్రిల్‌లో భారీ ఈదురుగాలుల వల్ల 233.79 హెక్టార్లలో నష్టం. అదే ఏడాది డిసెంబరులో మిచౌంగ్ తుఫాను వల్ల 10487.02 హెక్టార్లలో పంటనష్టం జరిగింది. ఈ ఏడాది జూలైలో భారీ వర్షాలు, గోదావరి వరదల వల్ల 10260.01 హెక్టార్లలో నష్టం జరిగింది. ఆగస్టు, సెప్టెంబర్లలో వరదలు, భారీ వర్షాల వల్ల 983.1939 హెక్టార్లలో పంట నష్టపోయింది. ఇందుకు రూ.35కోట్ల 95లక్షల 82వేల ఇన్‌ఫుట్ సబ్సిడీ ఇవ్వాల్సి ఉంది. అందులో జూలై నుంచి నష్టాలకు ఇన్‌ఫుట్ సబ్సిడీ ఇంకా ఇవ్వలేదు. కాకినాడ జిల్లా వరుసగా వర్షాలు, తుఫాన్లు, వరదలతో వణుకుతోంది. అయితే అల్పపీడనం.. లేదంటే తుఫాను.. అదీ ఎక్కువైతే ఏలేరు, సుద్దగడ్డ వరదలు... ఇంకాస్త తీవ్రత పెరిగే ఉప్పాడ సముద్రపు కోత.. ఇలా వరుసగా ఉత్పాతాలు జిల్లాకు కంటిపై కునుకు లేకుండా చేస్తోంది. గడచిన మూడేళ్లను పరిశీలిస్తే ఈ జిల్లాలో 2023 మార్చిలో భారీ వర్షాలకు 340 హెక్టార్లలో పంట నష్టపోయింది. 2023 ఏప్రిల్, మేలో కురిసిన భారీ వర్షాలకు 883 హెక్టార్లలో వరి దెబ్బతింది. డిసెంబరులో మిచౌంగ్ తుఫానుతో జిల్లాలో 26,905 మంది రైతులు 12,568 ఎకరాల్లో వరి పంట నష్టపోయారు. దీనివల్ల రూ.21.33 కోట్ల పంటనష్టం వాటిల్లింది. ఈ ఏడాది ఆగస్టు, సెప్టెంబరులో ఏకధాటిగా కురిసిన భారీ వర్షాలు, ఏలేరు వరదలకు జిల్లాలో 26,612 మంది రైతులకు చెందిన 14,425 హెక్టార్లలో వరి, ఐదు వేల ఎకరాల్లో వాణిజ్య పంటలు దెబ్బతిన్నాయి. రూ.52 కోట్ల నష్టం నమోదైంది. 2024లో జూలై వరదలకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 1596 ఎకరాల్లో ఉద్యానవన పంటలు, 3453 ఎకరాల్లో వరి పంట దెబ్బతింది.



కోనసీమలో వరద కష్టాలు (ఫైల్‌ఫొటో)

భారీ వర్షాలు. జీవనం అస్తవ్యస్తం

ఉమ్మడి తూర్పు గోదావరిలో జిల్లాలో ఏటా వర్షాలు, వరదలు, తుఫాన్లు జలవిలయాన్ని తలపిస్తున్నాయి. ఎగువ నుంచి ప్రళయంలా వచ్చిపడుతున్న గోదావరి వరద (మిగతా 6వ పేజీలో)



అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్

ఇసుక ఉచిత సరఫరాకు చర్యలు చేపట్టండి

అధికారులతో సమీక్షలో కలెక్టర్ మహేష్‌కుమార్

కొత్తపేట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ రంగాల డిమాండ్‌కు అనుగుణంగా ఇసుక సరఫరాకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన కొత్తపేట ఆర్డీవో కార్యాలయంలో సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇసుక రీచ్‌ల్లో నీరు పూర్తిగా తగ్గిన తర్వాత వాహనాల ఏర్పాటు, మానవవనరులు, మ్యాప్‌ల రూపకల్పన, అప్రోచ్ రోడ్లు తదితర అంశాల్లో ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఇసుక తవ్వకాలకు సన్నద్ధం కావాలన్నారు. వ్యవసాయ ఆధారిత జిల్లాగా ఉన్న కోనసీమలో కొబ్బరి, ఆక్వా, విలువ ఆధారిత, స్వయం ఉపాధి ఫుడ్ ప్రోసెసింగ్ యూనిట్లకు ప్రాధాన్యమిస్తూ ఔత్సాహికవేత్తలను ప్రోత్సహించాలన్నారు. జాతీయ గ్రామీణ జీవనోపాధి కమిటీ పర్యటనలో గుర్తించిన అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. జిల్లాలో చిన్నతరహా, ఆహార పరిశ్రమల ఏర్పాటుకు అవకాశాలు మెండుగా ఉన్నాయని, దీనికి సంబంధించి కేంద్ర, రాష్ట్ర పథకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. వాటి ద్వారా జీవనోపాధి పెంపుదలకు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, పరిశ్రమల కేంద్రం, బ్యాంకర్లు పూర్తి సమన్వయంతో ముందుకు వెళ్లాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, ఆర్డీవో శ్రీకర్, డీఆర్డీఏ పీడీ శివశంకరప్రసాద్, గనులు, భూగర్భ శాఖ జిల్లా అధికారి అశోక్‌కుమార్ పాల్గొన్నారు.



పల్లె టూరిజం

ఉప్పలగుప్తం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎస్.యానాం సముద్ర తీరానికి టూరిజం ప్రాజెక్టుగా అర్హతలు చాలానే ఉన్నాయి. ఎటు చూసినా సర్వే తోటలతో గ్రీన్‌బెల్ట్ పర్యాటకులకు ఈ తీరం ఎంతో ఆహ్లాదం కలిగిస్తుంది. అటు కాట్రేనికోన మండలం చిర్రయానాం వైపు, ఇటు అల్లవరం మండలం ఓడలరేవు వైపు కిలోమీటర్ల నిడివిన విస్తారమైన సముద్ర తీరం ఉంది. ఎస్.యానాం ప్రధాన గ్రామం నుంచి బీచ్‌కుమూడు కిలోమీటర్ల పొడవునా ఇటీవలే సీసీ రహదారి నిర్మించారు. బీచ్‌లో సైతం కిలోమీటర్ల మేర సీసీ రోడ్డు వేశారు. పర్యాటకుల కోసం ఇప్పటికే తీరంలో హట్స్ నిర్మాణం జరిగింది. రెస్టారెంట్, కళా వేదిక ఏర్పాటు చేశారు. రెండెకరాల విస్తీర్ణంలో ప్రత్యేక పార్కు నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేశారు. అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు స్వగ్రామమైన ఎస్.యానాం బీచ్ పర్యాటక కేంద్రంగా రూపుదిద్దుకునే అవకాశాలను గుర్తించి అప్పట్లో కోటి రూపాయలతో ప్రాజెక్టుకు అంకురార్పణ చేశారు. తిరిగి ఇప్పుడు ఎమ్మెల్యేగా ప్రాజెక్టు పూర్తి చెయ్యాలన్న సంకల్పంతో ఆయన ఉన్నత స్థాయిలో ప్రయత్నాలను ప్రారంభించారు. అంతర్జాతీయ పర్యాటక దినోత్సవం రోజున కలెక్టర్‌తో కలిసిటూరిజం ప్రాజెక్టు అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. ఇప్పటికే ఎస్.యానాం బీచ్‌కు సెలవు దినాల్లో అధిక సంఖ్యలో పర్యాటకుల రాకపోకలు జరుగుతున్నాయి. అందుకు బీచ్‌లో సోలార్ వెలుగులు పెంచాలని, పర్యాటకులకు పటిష్ట భద్రత కల్పించాలని కలెక్టర్ ఆదేశాలిచ్చారు. అభివృద్ధి పనులు వేగవంతం చేసి వచ్చే సంక్రాంతికి ప్రాజెక్టును సర్వాంగసుందరంగా సిద్ధం చేసేందుకు ఎమ్మెల్యే ప్రజల సహకారం కోరారు. ప్రాజెక్టు అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై వేదాంత ప్రతినిధి సతీష్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆనందరావు... కలెక్టర్‌తో చర్చించారు.

కేజీ బేసిన్‌లో ముడి చమురు ఉత్పత్తిలో రికార్డు సృష్టించి ప్రపంచ ప్రఖ్యాతి పొందిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని ఎస్.యానాం టూరిజం ప్రాజెక్టుగా దేశ టూరిజం జాబితాలో చోటు కోసం ఎదురు చూస్తోంది. ఆ దిశగా తొమ్మిదేళ్ల క్రితం అడుగులు పడ్డాయి. ప్రభుత్వం మార్పుతో ప్రాజెక్టుకు బ్రేక్ పడింది. మళ్లీ ఇప్పుడు ప్రాజెక్టు రూపకల్పనకు సత్వర చర్యలు ప్రారంభమయ్యాయి.





ఎస్.యానాం బీచ్‌లో రెండెకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేయనున్న గ్రీన్ పార్కు ఊహా చిత్రం

- దేశ టూరిజం జాబితాలో ఎస్.యానాం
- రెండెకరాల విస్తీర్ణంలో గ్రీన్ పార్కు ఏర్పాటుకు చర్యలు
- గ్రీన్‌బెల్ట్‌తో పర్యాటకులను ఆకర్షిస్తున్న బీచ్
- ఎటు చూసినా కిలోమీటర్ల మేర విస్తరించిన తీర ప్రాంతం
- బోట్ షికారుకు వీలుగా బ్యాక్‌వాటర్
- ఇప్పటికే బీచ్‌లో సీసీ రహదారుల నిర్మాణం, సోలార్ దీపాల ఏర్పాటు



బీచ్‌లో నిర్మించిన సీసీ రోడ్డు



కలెక్టరుతో చర్చిస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు, వేదాంత ప్రతినిధి సతీష్‌రెడ్డి

జాతీయ టూరిజం జాబితాలోకి ఎస్.యానాం

ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు



టూరిజం ప్రాజెక్టుగా ఎస్.యానాం జాతీయ గుర్తింపు పొందేందుకు అన్ని అర్హతలు ఉన్నాయి. వైట్‌సాండ్ బీచ్ ఎస్.యానాం ప్రత్యేకత. సముద్ర జలాలకు సమాంతరంగా బీచ్‌కు మరోవైపు బ్యాక్ వాటర్ ప్రవాహం ఉంది. దీంతో ఇక్కడ బోట్ షికారుకు ఎంతో అనువుగా ఉంటుంది. గతంలో రాష్ట్ర టూరిజం శాఖ ఆధ్వర్యంలో ప్రాజెక్టు రూపకల్పన జరిగింది. పనులు పూర్తి చేసి ఉంటే ఇప్పటికే పర్యాటక కేంద్రంగా ఎస్.యానాం అభివృద్ధితో పాటు ప్రభుత్వానికి ఆదాయం వచ్చేది. ప్రాజెక్టు పూర్తయితే గ్రామంలో ఎంతోమంది నిరుద్యోగులకు ఉపాధి లభిస్తుంది. పంచాయతీకి ఆదాయం చేకూరుతుంది. పది మందికి లాభం చేకూర్చేదే ఈ ప్రాజెక్టు. అందుకే ఎస్.యానాం ప్రాజెక్టు గుర్తింపు కోసం రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రితో మాట్లాడాను. ప్రతి ఆదివారం అమలాపురం నుంచి బీచ్ వరకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాము. ప్రాజెక్టు పూర్తయ్యేందుకు గ్రామస్తులు అంకితభావంతో సహకరిస్తే ఎస్.యానాం జాతీయ స్థాయిలో పర్యాటక కేంద్రంగా స్థానం సంపాదించడం ఖాయం.

ఈవీఎం గోదాముల పరిశీలన



గోదాముకు వేసిన సీలును పరిశీలిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

ముమ్మిడివరం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఈవీఎంలు, వీవీ ప్యాట్స్ భద్రపరిచిన తలుపుల సీలును కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ శనివారం పరిశీలించారు. సార్వత్రిక ఎన్నికల్లో జిల్లాలో వినియోగించిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను ముమ్మిడివరం ఎయిమ్స్ కళాశాలలో భద్రపరిచిన విషయం విదితమే. నెలవారీ తనిఖీలో భాగంగా ఈవీఎం, వీవీ ప్యాట్స్ గోదామును కలెక్టర్ మహేష్‌కుమార్, రెవెన్యూ, అగ్నిమాపక, ఎన్నికల అధికారులతో కలిసి చూశారు. వాటి రక్షణకు చేపడుతున్న ఏర్పాట్లను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈవీఎంలు, వీవీ ప్యాట్‌ల భద్రతకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. భారత ఎన్నికల సంఘం నిర్దేశం మేరకు ప్రతినెలా ఈవీఎం, వీవీ ప్యాట్ గోదాములను క్షుణ్ణంగా తనిఖీ చేస్తామని, ప్రతి మూడు నెలలకు ఒకసారి జిల్లాలో గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో గోదాములను పూర్తిగా పరిశీలించి భారత ఎన్నికల సంఘానికి సమగ్ర నివేదిక పంపిస్తామని కలెక్టర్ చెప్పారు. ఆయన వెంట జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు, కో-ఆర్డినేటర్, సూపరింటెండెంట్ మురళీకృష్ణ, తహసీల్దారు ఎం.సుబ్బలక్ష్మి, డిప్యూటీ తహసీల్దారు శివరాజు, ఆర్ఐ రవిశంకర్, కలెక్టరేట్ ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.



రేపటి నుంచి వాడపల్లి వేంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు... 7లో



జాయింట్ కలెక్టర్ నిషాంతి శనివారం వాడపల్లి వెంకన్నను దర్శించుకున్నారు. ఆమెకు ఈవో స్వామివారి చిత్రపటం అందజేశారు.... వివరాలు 7లో



ముమ్మిడివరంలో గౌరీదేవికి పూజలు నిర్వహిస్తున్న మహిళలు

అట్లతద్దోయ్.... ఆరట్లోయ్...

అట్లతద్దోయ్... ఆరట్లోయ్ అంటూ వేకువజామునే మహిళలు లేచి అట్లతద్దిని ఎంతో వైభవంగా జరుపుకున్నారు. కన్నెపిల్లలు, యువతులు, ముత్తయిదువులు తెల్లవారుజామునే తలస్నానాలు ఆచరించి గౌరీదేవికి ప్రత్యేక పూజలు చేశారు. సూర్యోదయానికి ముందే గోంగూర అన్నం, పెరుగన్నం తిని సాయంత్రం వరకు ఉపవాసం వున్నారు. గౌరీదేవి వ్రతాన్ని ఆచరించిన మహిళలతో బ్రాహ్మణులు ప్రత్యేక పూజలు చేయించారు. అట్లు, పండ్లు నివేదించి వాటిని ప్రసాదంగా స్వీకరించారు. అమ్మాయిలు తమకు మంచి భర్త దొరకాలని... అమ్మలు తమ కుటుంబం సుఖసంతోషాలతో ఉండాలని... అమ్మమ్మలు తమ జీవితం సాఫీగా సాగాలని... గౌరీదేవికి ప్రత్యేక పూజలు జరిపారు. చంద్రోదయం తర్వాత మరలా గౌరీదేవిని పూజించి గోదావరి, నదీపాయల్లో దీపాలు, అర్ఘ్యాలు వదిలారు. అనంతరం ముత్తయిదువులు వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు. గోపూజ చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు యువతులు, మహిళలు ఉయ్యాలలూగి ఉత్సాహంగా గడిపారు. దీంతో పల్లెలన్నీ కళకళలాడాయి. - అంబాజీపేట/ముమ్మిడివరం (ఆంధ్రజ్యోతి)



ఆలమూరు మండలం పినపళ్లలో కాలువ వద్ద గౌరీదేవి పూజ చేస్తున్న మహిళలు



మన అప్పలరాజే.. రాజబాబు!

రాజమహేంద్రితో విడదీయరాని అనుబంధం.. మానవత్వంలో తనకు తానే సాటి.. నేడు హాస్యనటుడు రాజబాబు జయంతి

(రాజమహేంద్రవరం సిటీ-ఆంధ్రజ్యోతి)

గోదావరి జిల్లాల నుంచి ఎందరో మహానుభావులు ఈ ప్రపంచానికి పరిచయం అయ్యారు. వారికున్న ప్రతిభను చాటి ఆయా రంగాల్లో అగ్రస్థానానికి చేరుకుని ఈ ప్రాంతానికి ఎనలేని కీర్తి ప్రతిష్ఠలను తీసుకువచ్చారు. గోదావరి నీరు తాగిన వారికి ఎటకారం ఎక్కువ అనే నానుడిని నిజం చేస్తూ ఆ వెటకారాన్ని హాస్యంగా మలిచి తెలుగు చలన చిత్రసీమలో నవ్వుల రేడుగా తనదైన ముద్రవేసుకున్న వారిలో అగ్రజుడు పుణ్యమూర్తుల అప్పలరాజు (హాస్యనటుడు రాజబాబు). పశ్చిమగోదావరి జిల్లా నర్సాపురంలో 1937 అక్టోబరు 20న రాజబాబు జన్మించారు. ఆయన స్వస్థలం మండపేట. ఆయన బాల్యం మండపేటలోను, రాజమహేంద్రవరంలోను సాగింది. రాజబాబు తండ్రి ఆర్అండ్‌బీలో ఉద్యోగి కావడంతో రాజమహేంద్రవరంలో ఉద్యోగరీత్యా ఆయన ఇక్కడకు వచ్చారు. తర్వాత సెకండరీ గ్రేడ్ టీచర్‌గా శిక్షణ పొందిన రాజబాబు రాజమహేంద్రవరంలో చాలాకాలం పేద విద్యార్థులకు ట్యూషన్ చెప్పి తన జీవితాన్ని ఇక్కడే ప్రారంభించారు. తాను పుట్టిన ఊరు తర్వాత సొంతూరుగా రాజమహేంద్రవరాన్నే ప్రకటించుకున్నారు. రాజమహేంద్రవరంలో బాబులు స్టూడియో అధినేత బాబుతో రాజబాబుకు మంచి అనుబంధం ఏర్పడింది. బాల్యం నుంచి నాటకాలపై మక్కువ ఉన్న రాజబాబు రాజమహేంద్రవరంలో సునంద మ్యూజికల్ పార్టీలో చేరి మిమిక్రీ చేయడం, నాటక ప్రదర్శనలు చేయడం వంటి చేశారు. అటుపై సినిమా రంగంపై ఉన్న ఆసక్తితో మద్రాసు వెళ్లాలని నిర్ణయించుకున్నపుడు బాబులు స్టూడియో అధినేత బాబు, తన శ్రేయోభిలాషులు కానుమిల్లి చిట్టిబాబు, గండిపల్లి చిట్టిబాబు, వి.చిట్టిబాబు తదితరులు ఆయనకు సహకరించారు. తమ స్నేహితుడ్ని మద్రాసుకు పంపించారు. దీంతో రాజబాబు జీవితం గొప్ప మలుపుతిరిగింది. సినిమా రంగంలో హాస్యనటుడిగా తిరుగులేని స్థానానికి చేరుకున్నారు. కళలకు కాణాచి అయిన రాజమహేంద్రవరమంటే రాజబాబుకు ఎంతో మక్కువ. తాను మద్రాసు వెళ్లేందుకు సహకరించిన మిత్రుల పేర్లన్నీ చివర బాబు ఉండడంతో తాను సినిమా జీవితంలోకి అడుగుపెట్టాక అప్పలరాజు పేరులో ఉన్న రాజుకు తన మిత్రుల పేర్లను జత చేసుకుని రాజబాబుగా మార్చుకుని వారిపై తనకున్న ప్రేమావాత్సల్యాలను వ్యక్తపరిచారు.

సెక్యూరిటీగార్డు రూమ్‌లో బస

చెన్నపట్నం సినిమా అవకాశాల కోసం వెళ్లిన తొలినాళ్లలో అవకాశాల కోసం తిరిగే సమయంలో రాజబాబు చాలా ఇబ్బందులుపడ్డారు. ఆయన తొలుత అప్పటి హీరోయిన్ రాజసులోచన ఇంటి సెక్యూరిటీగార్డు రూమ్‌లో ఆశ్రయం పొందారు. రాజబాబు సినిమా రంగంలో స్థిరపడ్డాక సెక్యూరిటీ గార్డుకు ఒక ఇంటినే బహుమతిగా ఇవ్వడం విశేషం.

575 సినిమాల రికార్డు

రాజబాబు తిరుగులేని హాస్యనటుడుగా ఎదిగారు. గోదావరి జిల్లాలకు చెందిన మరొక ప్రముఖ హాస్యనటుడు రేలంగి వెంకటరామయ్య 1960లో తీసిన 'సమాజం'లో సినిమాలో రాజబాబుకు అవకాశం ఇచ్చారు. అది మొదలుకొని అనేక విభిన్నమైన సినిమాల్లో రాజబాబు రాణించారు. అలనాటి అగ్రనటులు ఎన్టీఆర్, ఏఎన్ఆర్, ఎస్వీ రంగారావు, కృష్ణ, శోభన్‌బాబు, కాంతారావు వంటి వారి సినిమాల్లో కచ్చితంగా రాజుబాబు పాత్ర ఉండేది. అప్పట్లో అగ్రనటుల సినిమాల్లో రాజబాబు పాటతో కూడిన సినిమాలు ఉండేవంటే ఆయన ప్రాముఖ్యత ఆ స్థాయిలో ఉండేది. రాజబాబు స్వయంగా సినిమాలు తీశారు. సొంతంగా ఎవరికివారే యమునాతీరే, మనిషి రోడ్డునపడ్డాడు వంటి 8 సినిమాలు ఆయన తీశారు. మొత్తం 575 సినిమాల్లో నటించి రికార్డు సృష్టించారు.

గతం మర్చిపోని మంచి మనిషి

తాను పుట్టిన ఊరు, పెరిగిన తీరు, సహకరించిన మిత్రులు, జీవితాన్ని ఇచ్చిన చిత్రసీమలో ఎదుగుదలకు ప్రోత్సహించిన వారిని రాజబాబు ఏనాడూ మర్చిపోలేదు. గతాన్ని మర్చిపోకుండా



గోదారి గట్టున రాజబాబు విగ్రహం

మానవత్వంతో ఈ సమాజానికి తన దైన శైలిలో సేవచేసిన నటుడు రాజబాబు. ఆయన కళాకారుడుగా గుర్తింపు తెచ్చుకున్న రాజమహేంద్రవరంలో అనేక సేవలు రాజబాబు చేశారు. సినిమారంగంలో సక్సెస్ అయ్యాక రాజబాబు రాజమహేంద్రవరం వచ్చిన సమయంలో ఇక్కడ పారిశుధ్య కార్మికుల్లో కొంతమందిని గుర్తించి వారికి ప్రస్తుత కంబాలచెరువు షాడే స్కూల్ సమీపంలో ఇళ్లు కట్టించి ఇచ్చారు. అదేవిధంగా కోరుకొండలో ప్రభుత్వ కళాశాలను కట్టించారు. అది రాజబాబు జూనియర్ కళాశాలగా ఉంది. అలాగే ఎంతోమంది అనేకమంది పేద విద్యార్థుల చదువులకు ఆర్థిక సాయం చేశారు. ప్రస్తుత సుబ్రహ్మణ మైదానంలో ఉన్న ఆనం కళాకేంద్రానికి లక్ష విరాళం ఇస్తానని తన పేరుపెట్టాలని ఆయన అప్పటి ప్రభుత్వానికి సూచిస్తే అప్పటి ప్రభుత్వం రెండు లక్షలు విరాళం ఇచ్చిన వారి పెట్టింది. లేదంటే ఇప్పుడు దానిపేరు రాజబాబు కళాకేంద్రంగా ఉండేది. నవ్వుల రారాజుగా వెలుగొందిన రాజబాబుకు భార్య, పిల్లలు ఉన్నారు. వారు సినిమారంగానికి దూరంగా ఉన్నారు. వారు అమెరికాలో స్థిరపడ్డారు. రాజబాబు సోదరులు మాత్రం సినిమా రంగంలోనే ఉన్నారు. రాజబాబు 1983 ఫిబ్రవరి 7న మరణించారు. అటుపై 2011 ఏప్రిల్ 9న రాజమహేంద్రవరం గోదావరి బండ్‌పై మాజీ ఎంపీ సినీనటుడు మాగంటి మురళీమోహన్ ప్రతిష్టాత్మకంగా రాజబాబు విగ్రహాన్ని ఏర్పాటుచేశారు. ఈ విగ్రహాన్ని దర్శకరత్న దాసరి నారాయణరావు ఆవిష్కరించారు. ఈ విగ్రహావిష్కరణకు 75 మంది హాస్యనటులు, నటీమణులు హాజరయ్యారు. ఇటువంటి హాస్యనట రారాజు రాజబాబు జయంతి నేడే.

సుడిగుండాలు!

(ఐదవ పేజీ తరువాయి)

ఇటు ముందుకు దూసుకొస్తున్న సముద్రం.. ఆకాశానికి చిల్లులు పడ్డాయా అన్నట్టు నిత్యం భారీ వర్షాలు, తుఫాన్లు.. జనజీవనాన్ని అస్తవ్యస్తం చేస్తున్నాయి. ఈ ఏడాది ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కురిసిన వర్షపాతం అవసరానికి మించిపోయింది. భూగర్భజలాలు తన్నుకు వచ్చేలా చేసింది. ప్రధానంగా కాకినాడ జిల్లాలో ఈ వర్షాకాలం సీజన్‌లో జూన్ 1 నుంచి సెప్టెంబరు 30 వరకు లెక్కలు తీసుకుంటే 660 మిల్లీ మీటర్ల వర్షపాతం కురవాల్సి ఉంటే ఏకంగా 927 మిల్లీ మీటర్లు కురిసింది. తూర్పుగోదావరి జిల్లాలో 775.9 మి.మి.కిగాను 1,022 మి.మి. కురిసింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 778 మి.మి.కిగాను 979 మి.మి. నమోదైంది. కొత్త తూర్పుగోదావరి జిల్లాలో చూస్తే జూన్‌లో 3767.4 మిల్లీమీటర్లు, జూలైలో 7118.8 మిల్లీమీటర్లు నమోదైంది. ఆగస్టులో 3596.1 మిల్లీమీటర్లు, సెప్టెంబరులో 4157 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఇవి సాధారణ వర్షపాతాలకంటే చాలా ఎక్కువ. కానీ ఒక ఆగస్టులో మాత్రం సాధారణ వర్షపాతం 4532.8 మిల్లీమీటర్లుగా ఉండగా, ఈసారి కాస్త తక్కువగా 3596.1 మిల్లీ మీటర్లు నమోదైంది. ఇప్పటికీ వర్షాలు పడుతుండడంతో సాధారణ జనజీవనంలో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రైతులూ కలవరపడుతున్నారు.



సముద్రతీరం.. జాలర్ల జీవితం అల్లకల్లోలం

(కాకినాడ/అమలాపురం-ఆంధ్రజ్యోతి)

సముద్రతీరంలో జరుగుతున్న కల్లోలం కూడా ఎంతో నష్టాన్ని కలుగజేస్తోంది. ఇప్పటికే సముద్రతీరంలో కోత మత్స్యకారుల ఊళ్లను మింగేస్తోంది. కాకినాడ జిల్లాలో తొండంగి తీరం నుంచి కాకినాడ వరకు మొత్తం 144 కిలోమీటర్ల మేర సముద్రం విస్తరించి ఉంది. బంగాళాఖాతంలో చిన్న అల్పపీడనం ఏర్పడితేచాలు.. ఎక్కడా లేనంతగా తీరం ఉగ్రరూపం ప్రదర్శిస్తోంది. ముఖ్యంగా ఉప్పాడలో అయితే సముద్రం అల్లకల్లోలంగా మారి మత్స్యకారుల ఇళ్లను ముంచేస్తోంది. ఉప్పాడ బీచ్ రోడ్డును ఛిద్రం చేసేస్తోంది. ఆ సమయంలో మత్స్యకార కుటుంబాలు బిక్కుబిక్కుమని గడుపుతాయి. ఇప్పటివరకు వాతావరణ మార్పులు, తుఫాన్ల వల్ల ఉప్పాడ వద్ద సముద్రం గడచిన రెండు దశాబ్దాల్లో 1,360 ఎకరాలను మింగేసి ముందుకొచ్చేసింది. దాదాపు పాతకసార్లు ఉప్పాడ బీచ్ రోడ్డును ఛిద్రం చేసేసింది. ఇప్పటివరకు ఈ రహదారి మరమ్మతులకు రూ.35 కోట్ల వరకు ఖర్చు చేయాల్సి వచ్చిందంటే తీవ్రత ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇదే జిల్లాలో సముద్రతీరం వెంబడి 24,500 మంది మత్స్యకారులు సముద్రంపై వేట సాగిస్తూ జీవనాధారం పొందుతున్నారు. పొద్దున లేస్తే సాగరమాత ఒడిలోనే వీరంతా బతుకుతారు. బోట్లు వేసుకుని రోజుల తరబడి వేట సాగిస్తూ ఉపాధి పొందుతారు. సముద్రంలో వేట లేదంటే పూట తిండికీ ఇబ్బంది పడాల్సిన పరిస్థితులు. అయితే జూన్ నుంచి అక్టోబరు మధ్య తరచూ వచ్చే తుఫాన్లు, భారీ వర్షాలతో మత్స్యకారులు రోజుల తరబడి వేట సాగించడానికి వీల్లేని పరిస్థితి. మత్స్యశాఖ హెచ్చరికలతో బోట్లు కట్టేసి ఇంటివద్దనే ఉండాల్సిన పరిస్థితి. ఇలా ఏడాదిలో సముద్రంలో వేట నిషేధ సమయం కాకుండా కనీసం అంతా కలిపితే నలభై రోజుల వరకు పలు దఫాలుగా వేట అర్ధాంతరంగా ముగించుకుని ఒడ్డుకు రావలసిన పరిస్థితి. ఇలా జరిగే ప్రతి సమయంలో వందల లీటర్ల డీజిల్ వృథా ఖర్చుకింద మారుతూ మత్స్యకారులు నష్టపోతున్నారు. ఈ సమయంలో వీరిని ఆదుకునే పథకాలేవీ లేకపోవడంతో వరుణుడు ఎప్పుడు కరుణిస్తాడా అని కళ్లుకాయలు కాచేలా ఎదురుచూడాల్సిన పరిస్థితి. ఈ ఏడాది అయితే వర్షాలు జిల్లాపై పగబట్టినట్టు అదేపనిగా పడుతూనే ఉన్నాయి. అటు యానాంలోనూ ఇదే పరిస్థితి. ఇక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని ఎనిమిది మండలాల పరిధిలో బంగాళాఖాతం సముద్ర తీరం ప్రాంతం 40 కిలోమీటర్ల మేర ఉంది. ఈ తీరం వెంబడి అలల తీవ్రత పెరుగుతుండడంతో తీరం భారీగా కోతకు గురై తీర ప్రాంత ప్రజలను కలవరపెడుతోంది. ముఖ్యంగా అంతర్వేది, కరవాక, అల్లవరం మండలం ఓడలరేవు ప్రాంతాల్లో ఆస్తుల విధ్వంసం భారీగా ఉంది. అంతర్వేది బీచ్‌లో ఉండే తాత్కాలిక హోటల్స్, దుకాణాలు, రిసార్ట్స్ వంటివి కూడా ముంపునకు గురవుతున్నాయి. అల్లవరం మండలం ఓడలరేవులోని సముద్ర తీరంలో ఉన్న ఓఎన్జీసీ ప్లాంటు ప్రహరీ గోడ ఇప్పటికే ధ్వంసమైంది. గతంకంటే భిన్నంగా తీర ప్రాంతంలో అలల తీవ్రత ఆందోళనకరంగా ఉంది. మత్స్యకారుల జీవనంపై తీవ్ర ప్రభావం పడింది.



ఏజెన్సీలో కష్టాలు వర్ణనాతీతం

(చింతూరు-ఆంధ్రజ్యోతి)

గోదావరి ఎగువన ఏజెన్సీ ప్రాంతం వర్షాలు, తుఫాన్లకు తల్లడిల్లిపోతోంది. ఏటా వారికి జరుగుతున్న నష్టం బయట ప్రపంచానికి అంతగా తెలియదు. విలీన మండలాలైన చింతూరు కూనవరం వరరామచంద్రపురం, ఎటపాక మండలాల దుస్థితి మరీ దారుణం. ఈ ఏడాది మూడుసార్లు వరద వచ్చింది. అటు ఛత్తీస్‌గడ్, ఇటు ఒడిస్సా, మరోవైపు తెలంగాణ ఎటు వర్షం వచ్చినా మునిగేది ఈ మండలాలే. ఇవి సరిపోదన్నట్టు ఇపుడు పోలవరం బ్యాక్ వాటర్ తోడైంది. రోజుల తరబడి ఊళ్లు బాహ్య ప్రపంచానికి దూరమై చీకటిలో మగ్గుతుంటాయి. రోడ్లన్నీ నీటమునిగి చివరకు నిత్యావసర వస్తువులు లభ్యంకాక పచ్చడి మెతుకులే పరమాన్నంగా కడుపు నింపుకుంటూ గడపాల్సిన దయనీయం. గంట గంటకూ వరద పెరుగుతుంటే రాత్రి పూట చిమ్మచీకటిలో సురక్షితం కోసం అడవుల్లోకి పరుగులు పెట్టాల్సిందే. ఇక నడువ ఓపిక లేని వృద్ధులు, చంటి పిల్లలు, తల్లులు, గర్భిణీలు పడే వెతలు చెప్పతరం కానివి. అదే ఆస్తిగా పెంచుకొనే పశువులు, కోళ్లు ప్రతి మారు వరద ఉధృతికి కొట్టుకుపోతూనే ఉంటాయి. పంటలు మునిగి కుళ్లిపోతాయి. అడవుల్లో వలస గుడిసెలు వేసుకొని జీవించాల్సిందే. ఆయా సమయాల్లో విషసర్పాల బారినపడ్డ సందర్భాలు లేకపోలేదు. ఇక అదే సమయంలో ప్రాణాంతక వ్యాధి సోకితే భగవంతుడిపైనే భారం. ఇక వరద తగ్గాక ఇంటినిండా పేరుకుపోయిన బురద. కూలిన గోడలు, వరద ఉధృతికి కొట్టుకుపోయిన పైకప్పు.. మరోవైపు ఊరంతా దుర్వాసన. తాగడానికి నీరు దొరకని స్థితి. చింతూరు డివిజనులో దాదాపు 120 గ్రామాలకు చెందిన సుమారు 20 వేల మంది వరకు ప్రజలతో ప్రకృతి చెలగాటమాడుతోంది. ఇక అటు వీఆర్ పురం నుంచి దేవీపట్నం దాకా పోలవరం ప్రాజెక్టు ముంపు గ్రామాల్లో నష్టం అపారం.

కష్టాలు తీరినట్టేనా?

- రత్నగిరిపై సత్రం గదుల్లో బస చేసే భక్తులకు గదుల కేటాయింపు నిబంధనల్లో మార్పులు
- గదులన్నీ సీఆర్వో నుంచే కేటాయింపు
- డిపాజిట్, విత్‌డ్రా విషయంలో రాని స్పష్టత
- నకిలీ రశీదు వ్యవహారంపై గదుల కేటాయింపులో మార్పులు



అన్నవరంలోని సెంట్రల్ రిజర్వేషన్ కార్యాలయం

అన్నవరం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో సత్రం గదుల్లో బసచేసే భక్తుల కష్టాలు తీరినట్టేనని పలువురు భావిస్తున్నారు. రత్నగిరిపై సత్రం గదుల్లో బస చేసే భక్తులకు గదుల కేటాయింపు నిబంధనల్లో పలు మార్పులు చేశారు. నకిలీ రశీదుతో భక్తుడికి టోకరా వేసిన నేపథ్యంలో అధికారులు పునరాలోచనలో పడ్డారు. గదుల కేటాయింపు అంతా ఇకపై సీఆర్వో కార్యాలయం నుంచే చేపట్టాలని ఈవో రామచంద్రమోహన్ ఆదేశించడంతో శనివారంనుంచి గదులు సీఆర్వో నుంచి అందిస్తున్నారు. గతంలో ఈ విధానం అమలులో ఉండగా వైసీపీ హయాంలో మార్పుచేశారు. అప్పుడు ఏ సత్రం గది వద్ద అక్కడే భక్తులకు కేటాయించేవారు. దీంతో భక్తులు ఎక్కడ గదులు ఖాళీలు ఉన్నాయో తెలియక లగేజీ, పిల్లలతో అన్ని సత్రాలు తిరగాల్సి వచ్చేది.

రెండూ ఒకేచోట అయితే ఎలా

గదులు సీఆర్వో నుంచి కేటాయిస్తున్న భక్తులకు పూర్తిస్థాయి కష్టాలు తీరాలంటే ఇంకా బాలారిష్టాలు దాటాల్సి ఉంది. ప్రధానంగా సత్రం గదులు కేటాయింపు, డిపాజిట్ స్వీకరించడం ఒకేచోట నుంచి ఉండడంతో గది ఖాళీ చేసిన భక్తుడు మళ్లీ డిపాజిట్‌కోసం సత్రంనుంచి సీఆర్వోకి రావాల్సి ఉంటుంది. ఈ విషయంలో అధికారులు పునరాలోచన చేయాల్సి ఉంది. గది కేటాయింపు సీఆర్వో కార్యాలయంవద్ద ఇచ్చి డిపాజిట్ తీసుకోవడం, ఖాళీ చేసేటప్పుడు చెల్లించడం ఆయా సత్రాలవద్ద పెట్టాలని భక్తులు కోరుతున్నారు. సీఆర్వోవద్ద డిపాజిట్, రిఫండ్ పెట్టడంవల్ల ట్రాఫిక్ ఇబ్బందులు కలిగే అవకాశం ఉంది. గది తీసుకునే భక్తుడు, ఖాళీ చేసి డిపాజిట్ రిఫండ్ కోసం వచ్చేవారితో భారీక్యూలైన్ ఏర్పడి భక్తులు వేచి ఉండాల్సి వస్తుంది. కార్యాలయ సిబ్బందికి కూడా ఇబ్బందికర పరిణామంగా ఉండనుంది. ఈ విషయంలో ఈవో పునరాలోచన చేయాలని కోరుతున్నారు. ముందు గదులన్నీ ఒకేచోట కేటాయించడంతో భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కార్తీక మాసానికి 'పాదగయ' ముస్తాబు

- నవంబరు 2 నుంచి ప్రారంభం
- నెలరోజులు పాటు ప్రత్యేక పూజలు
- 4 నుంచి దత్త మహామండల దీక్ష
- ఇరుముడి ధారణ, విరమణ ఇక్కడే



పిఠాపురం పాదగయ క్షేత్రంలోని స్వయంభూ దత్తాత్రేయస్వామి

పిఠాపురం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): పిఠాపురం పాదగయ క్షేత్రం కార్తీకమాసానికి, దత్త మాలధారణ(దత్త దీక్షల స్వీకరణ) కార్యక్రమాలకు సిద్ధమవుతోంది. స్వయంభూ కుక్కుటేశ్వర స్వామి కొలువైనఉన్న క్షేత్రం కావడంతో స్వామి, అమ్మవార్ల దర్శనానికి, పూజలు, పుష్కరిణిలో పుణ్యస్నానాల ఆచరణకు తెలుగురాష్ట్రాల నుంచి భక్తులు తరలివస్తారు. క్షేత్రంలో వేంచేసిఉన్న స్వయంభూ శ్రీపాదశ్రీవల్లభ దత్తాత్రేయస్వామి సన్నిధిలో మహామండల, అర్థ మండల, సప్తాహ దీక్షలు చేపట్టేందుకు మాల ధారణ గావించనున్నారు. ఇందుకుగానూ ఆలయ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

పాదగయలో క్షేత్రంలో కుక్కుటేశ్వరస్వామి దేవస్థానం కార్తీకమాస ఉత్సవాలకు ముస్తాబవుతోంది. స్వయంభూ కుక్కుటేశ్వరస్వామి, ఆదిశంకరాచార్య ప్రతిష్ఠించిన రాజరాజేశ్వరీ దేవి, అష్టాదశ శక్తి పీఠాల్లో దశమ శక్తి పీఠం అధిష్టాన దేవతయిన పురుహూతికాఅమ్మవారి క్షేత్రం కావడంతో కార్తీకమాసంలో నెలరోజులు పాటు భక్తులరద్దీ అధికంగా ఉంటుంది. ఉభయ తెలుగురాష్ట్రాల నుంచే గాక కర్నాటక, మహారాష్ట్ర, ఒడిశా భక్తులు ఎక్కువగా ఈ సమయంలో వస్తారు. నవంబరు 2న కార్తీకమాసం ప్రారంభమై డిసెంబరు 1వతేదీ వరకూ ఉంటుంది. కార్తీక సోమవారాలు, ఏకాదశి, ద్వాదశి, మహాశివరాత్రి, పౌర్ణమి పర్వదినాల్లో వేలసంఖ్యలో భక్తులు పాదగయ పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించేందుకు తరలివస్తారు. ఇందుకుగాను ఇప్పటికే పాదగయపుష్కరిణిలో నీటిని తొలగించి కొత్త నీరు పెట్టే పనులు ప్రారంభించారు. కార్తీకమాస మహాపర్వదినాల్లో ప్రతి నిత్యం భక్తులగోత్రనామాలతో స్వయంభూలింగ మూర్తి అయిన రాజరాజేశ్వరీ సమేత ఉమా కుక్కుటేశ్వరస్వామికి పంచామృత మహా న్యాస పూర్వక రుద్రాభిషేకం జరుగుతుంది. కార్తీకమాసంలో వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని ఆలయ ఈవో, సహాయ కమిషనరు పి.విశ్వనాథరాజు తెలిపారు.



పిఠాపురం పాదగయలోని పుష్కరిణి

4 నుంచి దత్త దీక్షల స్వీకరణ

దత్తదీక్షల స్వీకరణకు, కార్తీకమాసంలో దత్తజయంతి ఉత్సవాలను పురస్కరించుకుని నవంబరు 4న దత్త మహామండల దీక్ష ప్రారంభం కానుంది. ఆ రోజున దీక్ష స్వీకరించేవారికి మాలధారణ గావిస్తారు. అర్థమండలదీక్ష ఆచరించే భక్తులకు నవంబరు 24న, సప్తాహ దీక్ష ఆచరించే భక్తులకు డిసెంబరు 7న మాలధారణ జరుగుతుంది. ఆయా రోజుల్లో ఉదయం 6గంటల నుంచి విఠలానంద మహారాజ్ ఆశీర్వాదంతో దత్తసాయి సేవాసమితి అధ్యక్షుడు వాడ్రేవు శ్రీనివాసరావు గురుస్వామి మాలధారణ గావిస్తారు. ఆయా దీక్షాదారులకు డిసెంబర్ 14న ఉదయం 8గంటల నుంచి ఇరుముడిధారణ, అదేరోజు సాయంత్రం దత్తస్వాముల నగరోత్సవం జరుగుతాయి. 15న తెల్లవారుజామున శ్రీదత్త దీక్షా విరమణ, మహాపూర్ణాహుతి, స్వామికి మహాపూజా జరుగుతాయి. స్వయంభూ దత్తక్షేత్రం కావడంతో దత్తమాల ధరించేందుకు భక్తులు అధికంగా తరలివస్తారు. వారి కోసం ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

కొనసాగుతున్న రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీలు

కాకినాడ అర్బన్, అక్టోబరు 19: కాకినాడలోని వైఎస్సార్ స్కేటింగ్ రింక్‌లో నిర్వహిస్తున్న 68వ రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీలు రెండోరోజు కొనసాగాయి. ఆర్‌డీ-2,3 కేటగిరీల్లో పోటీలు నిర్వహించగా వివిధ జిల్లాలకు చెందిన క్రీడాకారులు పతకాలు సాధించారు.



స్కేటింగ్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

విజేతలు వీరే..

ఆర్‌డీ-2 కేటగిరీలో అండర్-11 బాలికల విభాగంలో డి.ప్రియ ఆనందశ్రీవర్షిణి బంగారు పతకం సాధించగా నెల్లూరుకు చెందిన కె.హన్విక రజతం, విశాఖకు చెం దిన సీహెచ్ చార్వి కాంస్యపతకం సాధించారు. బాలుర విభాగంలో తూర్పుగోదావరికి చెందిన సత్తి శ్యామ్ సుందర్‌రెడ్డి బంగారం, అనంతపురానికి చెందిన ఆర్.కార్తీక్‌రెడ్డి రజతం, చిత్తూరుకు చెందిన సి.ప్రణవ్ కాంస్య పతకాలు దక్కించుకున్నారు.

అండర్-14 బాలికల్లో తూర్పుగోదావరికి చెందిన కెల్లా భవ్యశ్రీ బంగారం, చిత్తూరుకు చెందిన కామిశెట్టి ఖ్యాతి రజతం, విజయనగరానికి చెందిన ఎల్.మధుహాసిత కాంస్య దక్కించుకున్నారు. బాలురలో తూర్పుగోదావరికి చెందిన ఎ.మహీధర్‌రాజ్‌కుమార్ బంగారం, కృష్ణాజిల్లాకు చెందిన ఎస్.బలరాం రజతం, నెల్లూరుకు చెందిన కె.వరుణ్ కాంస్య పతకం సాధించారు.

అండర్-17 బాలికల్లో తూర్పుగోదావరికి చెందిన హనీఫా మహమ్మద్ బంగారు పతకం, విశాఖకు చెందిన పెరవలి శ్రీకీర్తి రజతం, చిత్తూరుకు చెందిన పి.దియా కాంస్య పతకం సాధించారు. బాలురలో కృష్ణా జిల్లాకు చెందిన ఎంఎల్‌వీ సుధీర్ బవంగారం, గుంటూరుకు చెందిన హేమంత్‌సాయి రజతం, కృష్ణాకు చెందిన పి.రిత్విక్ హృషికేశ కాంస్య పతకం సాధించారు.

అండర్-19 విభాగం మహిళల్లో తూర్పుగోదావరికి చెందిన దూసర్లపూడి చరిష్మాసత్య బంగారు పతకం సాధించగా గుంటూరుకు చెందిన సిద్ధా హేమణ్య రజతం, నెల్లూరుకు చెందిన హాస్యరెడ్డి కాంస్య పతకాలు సాధించారు. పురుషుల్లో చిత్తూరుకు చెందిన సీహెచ్ మహీన్‌వర్మ బంగారు పతకం సాధించగా పి.వెంకటసాయి నిఖిల్ రజతం, ఎస్.శ్రీహర్షకుమార్ కాంస్య పతకం సాధించారు. కేటగిరీ-3,4 విభాగాల్లో విజేతలను ప్రకటించారు. ఆదివారంతో పోటీలు ముగుస్తాయని స్కూల్‌గేమ్స్ జిల్లా కార్యదర్శి జార్జి తెలిపారు.

రేపు స్కూల్ గేమ్స్ ఎంపికలు

కాకినాడ డీఎస్ఏ మైదానంలో ఈనెల 21న వివిధ క్రీడల్లో ఎంపికలు నిర్వహిస్తున్నట్టు స్కూల్ గేమ్స్ జిల్లా కార్యదర్శి ఎల్.జార్జి తెలిపారు. అండర్-14 టెన్నిస్, అండర్-14, 17 సైక్లింగ్‌తో పాటు రెజ్లింగ్ పోటీలు నిర్వహించి అర్హులను ఎంపిక చేస్తామన్నారు. ఆయా విభాగాల్లో అర్హులైన బాలబాలికలు హాజరవ్వాలని కోరారు.

'ఇదేంటి స్వామి' కథనంపై కలెక్టర్ ఆరా

- బెల్లంలో సుక్రోజు వల్ల తీపి తక్కువ
- అన్నవరం దేవస్థానం అధికారుల వివరణ

అన్నవరం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): సత్యదేవుడి సన్నిధికి సరఫరా అయ్యే బెల్లంలో కేవలం సుక్రోజు మాత్రమే ఉండాల్సిన దానికంటే తక్కువ పరిమాణం ఉండడంవల్ల తీపి తక్కువగా ఉండే అవకాశం ఉందని దేవస్థానం అధికారులు వివరణ ఇచ్చారు. ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'ఇదేంటి స్వామి' శీర్షికన శనివారం ప్రచురితమైన కథనంపై కలెక్టర్ ఆరా తీయడంతో అధికారులు వివరణఇచ్చారు. స్వామివారి ప్రసాదంలో బెల్లం వినియోగం ఉండదని, కేవలం అన్నదానంలో భక్తులకు అందించే సాంబారులో మాత్రమే వినియోగిస్తామని, ప్రతి ఆదివారం నిర్వహించే వైదిక కార్యక్రమం, సూర్యనమస్కారాలకు క్షీరాన్నంలో కిలో బెల్లం వినియోగిస్తామని తెలిపారు. దేవస్థానానికి సరఫరాఅయ్యే అన్నిరకాల రసవర్గాలను జిల్లా ఆహార భద్రత అధికారి సేకరించిన శాంపిల్స్‌కు అన్ని ప్రమాణాలు నిర్దేశిత విలువలకు లోబడిఉన్నట్లు నివేదిక ఇచ్చారన్నారు.

జేఎన్‌టీయూకేలో ముగిసిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమం

- ముఖ్యఅతిథిగా పాల్గొన్న యూసీఈకే ప్రిన్సిపాల్

జేఎన్టీయూకే, అక్టోబరు 19: వర్సిటీలోని యూసీఈకే సీఎస్ఈ విభాగంలోని సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఇన్ ఏఐ, ఎంఎల్ ఆధ్వర్యంలో ఇండస్ట్రీ 4.0 అనే అంశంపై రెండురోజులపాటు నిర్వహించిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమం శనివారం ముగిసింది. దీనిలో యూసీఈకే ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎన్.మోహన్‌రావు ముఖ్యఅతిథిగా పాల్గొనగా సీఎస్ఈ విభాగం ప్రొఫెసర్ ఎల్.సుమలత, ప్రొఫెసర్ ఏఎస్ఎన్ చక్రవర్తి సమన్వయకర్తలుగా వ్యవహరించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ అధ్యాపకులు ప్రస్తుతం బోధనలో వినూత్న పద్ధతులను అవలంబించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఇటువంటి ఎఫ్‌డీపీల ద్వారా అధ్యాపకుల్లో నూతన సాంకేతికతను నేర్చుకునేందుకు ఆసక్తి పెరుగుతుందన్నారు. రీసోర్స్‌పర్సన్‌లు డాక్టర్ కేఎం కృష్ణ, డాక్టర్ వల్లభ్‌రావు ఇండస్ట్రీ 4.0లోని కీలక అంశాల గురించి వివరించారు. అనంతరం ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమానికి హాజరైన అధ్యాపకులకు, పరిశోధక విద్యార్థులకు ముఖ్యఅతిథి సర్టిఫికెట్‌లను అందజేశారు. కరుణ, శివరామకృష్ణ, సునీత, విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యూసీఈకే ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మోహన్‌రావు


హుండీల ఆదాయం లెక్కిస్తున్న దృశ్యం

అంతర్వేది లక్ష్మీనరసింహుడి ఆదాయం రూ.37.16లక్షలు

అంతర్వేది, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమజిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేది లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో శనివారం స్వామివారి హుండీలను తెరిచి కానుకలను తనిఖీ అధికారి జె.రామలింగేశ్వరరావు పర్యవేక్షణలో లెక్కించారు. స్వామివారి ప్రధాన హుండీ ద్వారా రూ.36,37,308, గుర్రాలక్కమ్మ హుండీ ద్వారా రూ.22,379, అన్నదానం హుండీ ద్వారా రూ.56,625 ఆదాయం వచ్చింది. 106 రోజులకు స్వామివారికి రూ.37,16,312 ఆదాయం వచ్చిందని ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ తెలి పారు. కార్యక్రమంలో రాజోలు గ్రూపు దేవాలయ ఈవో ఎన్.వి.ఎస్.ఎస్.వి.ప్రసాదరాజు, సర్పంచ్ కొండ జాన్‌బాబు, ఎంపీటీసీ బైరా నాగరాజు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

పిఠాపురం పాదగయ ఈవోగా జగన్మోహన్ శ్రీనివాస్


పిఠాపురం పాదగయ ఈవో కాట్నం జగన్మోహన్ శ్రీనివాస్

పిఠాపురం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలోని పాదగయ క్షేత్రం కార్యనిర్వహణాధికారి కాట్నం జగన్మోహన్ శ్రీనివాస్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. గ్రేడ్-2 ఈవోగా ఉన్న ఈయన రాజమహేంద్రవరం సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ ఈవోగా రెగ్యులర్ బాధ్యతలు నిర్వహిస్తుండగా, పెద్దాపురం మహారాణి సత్రం ఇన్‌చార్జి ఈవోగా ఉన్నారు. ఇప్పుడు పాదగయ ఈవో, సహాయ కమిషనర్‌గా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ దేవదాయశాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటివరకూ పాదగయ ఈవో, సహాయ కమిషనర్‌గా తుని లోవ దేవస్థానం ఈవో పి.విశ్వనాథరాజు బాధ్యతలు నిర్వహించారు. కేవలం 22 రోజుల వ్యవధిలోనే ఈవోని మార్చేయడం చర్చనీయాంశంగా మారింది. విధుల్లో చేరిన జగన్మోహన్ శ్రీనివాస్ ఆలయంలోని కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహూతికా అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు.

వీరభద్రుడికి ప్రత్యేక పూజలు



సామర్లకోట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట కుమారరామ భీమేశ్వరాలయంలో శనివారం అట్లతద్ది పురస్కరించుకుని ఆలయ ఆవరణలో ఉన్న ఉపాలయంలో వీరభద్రస్వామికి విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పూజలలో అర్చకులు వెంకటరమణ, శ్రీకాకుళపు సత్యనారాయణమూర్తి, వేమూరి వెంకట రామశర్మ(చంటి), రాజగోపాలశర్మలచే వేద మంత్రోచ్చారణల మధ్య వీరభద్రునికి పంచామృతాభిషేకపూజలు నిర్వహించారు. పుష్పార్చన పూజలు చేశారు. నూతన పట్టు వస్త్రాలతో వీరభద్రుణ్ణి సర్వాంగసుంద రంగా అలంకరించారు.

ప్రీమియర్ లీగ్ క్రికెట్ సీజన్-3కి సామర్లకోట క్రీడాకారుడు ఎంపిక


మణికంఠ గంగాధర్

సామర్లకోట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట పట్టణానికి చెందిన మణికంఠ గంగాధర్ ఆంధ్రాప్రీమియర్ లీగ్ సీజన్-3 క్రికెట్ పోటీలకు ఎంపికయ్యారని జిల్లా క్రికెట్ సెలెక్షన్ కమిటీ ప్రతినిధి, ఫ్రెండ్స్ క్రికెట్‌క్లబ్ సామర్లకోట చైర్మన్ ఆవాల లక్ష్మీనారాయణ, జనసేన పట్టణ అధ్యక్షుడు డి.సరోజావాసులు అభినందించారు. ఈ మేరకు సామర్లకోట క్రీడామైదానంలో శనివారం పలువురు క్రికెటర్ల మధ్య అభినందన కార్యక్రమం నిర్వహించారు. వైజాగ్ వారియర్స్ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన గంగాధర్ సెమీఫైనల్, ఫైనల్‌లలో అద్భుత ప్రతిభ కనబర్చి బౌలింగ్ చేయడం ద్వారా అత్యధిక వికెట్లు సాధించాడన్నారు. దీంతో ఈనెల 22న చండీగఢ్ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో ఎంపికకు హాజరుకావాల్సిందిగా ఆహ్వానం అందిందన్నారు. ఐపీఎల్‌లో కూడా గంగాధర్ ప్రతిభ కనబర్చి క్రికెట్ క్రీడలో సామర్లకోట ప్రతిభ మరింత చాటగలడని ఆశాభావం వ్యక్తం చేశారు.

వాడపల్లి వెంకన్న బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు

రేపటి నుంచే ఉత్సవాలు ప్రారంభం

ఆత్రేయపురం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి 12వ వార్షిక బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టారు. కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అధ్యక్షతన బ్రహ్మోత్సవ ఏర్పాట్లపై సమీక్షించారు. ఉప కమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఈనెల 21 నుంచి 29వ తేదీ వరకు వైఖానస ఆగమశాస్త్ర ప్రకారం ఖండవల్లి వరప్రసాదాచార్యులు బ్రహ్మత్వంలో వేద పండితులు బ్రహ్మోత్సవ క్రతువు నిర్వహించనున్నారు. 21వ తేదీన ధ్వజారోహణంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. రాత్రి పరావాసుదేవ అలంకరణతో శేషవాహన సేవ. 22న ఉదయం అష్టదళ పాదపద్మారాధన, రాత్రి సరస్వతి అలంకరణతో హంస వాహనసేవ, 23న అష్టోత్తర శతకలశాభిషేకం, వేంకటేశ్వర హోమం, కోదండ రామ అలంకరణతో హనుమద్ వాహనసేవ, 24న తిరుప్పావడ సేవ యోగనారసింహ అలంకరణతో సింహవాహన సేవ, 25న గోదావరి నదీ జలసంగ్రహణం, మహాలక్ష్మి హోమం, రాత్రి మలయప్ప అలంకరణతో గరుడవాహన సేవ, 26న మహాపుష్పయాగం, శ్రీకృష్ణ అలంకరణతో సూర్యప్రభ వాహనసేవ, సహస్ర దీపాలంకరణ సేవ, మోహిని అలంకరణతో చంద్రప్రభ వాహనసేవ, 27న ఉదయం శ్రీనివాస కల్యాణం, రాత్రి రాజాధిరాజ అలంకరణతో గజవాహనసేవ, 28న తోమాల సేవ, మహా సుదర్శన హోమం, కల్పవృక్ష వాహన సేవ, చూర్ణోత్సవం, కల్కి అలంకరణతో అశ్వ వాహనసేవ, 29న మహాపూర్ణాహుతి, చక్రస్నానం, ఏకాంత సేవతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.


విద్యుత్‌కాంతులతో కనువిందు చేస్తున్న వెంకన్న ఆలయ సముదాయం


ప్రత్యేక అలంకరణలో వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి

వెంకన్న ఆదాయం రూ.24.53 లక్షలు

కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు తిరువీధుల్లో ఏడు ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. వేకువజామునే స్వామివారికి సుప్రభాత సేవ, నీరాజన మంత్రపుష్పం, ఐశ్వర్య లక్ష్మీహోమం, బాల భోగంలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించి స్వర్ణశోభితుడిని చేశారు. క్యూలైన్లలో బారులు తీరి స్వామివారిని దర్శించుకున్న భక్తులు తులాభారాలు, కానుకలు సమర్పించి అన్నప్రసాదం స్వీకరించారు. కోనసీమజిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతిస్వామివారిని దర్శించుకోగా ఆమెకు ఉప కమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు స్వామివారి చిత్రపటం అందజేశారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.24.53లక్షలు లభించినట్టు ఉప కమిషనర్ చెప్పారు.


ప్రత్యేక అలంకరణలో శృంగారవల్లభస్వామి

శృంగార వల్లభస్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు

పెద్దాపురం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): కాకినాడజిల్లా పెద్దాపురం మండలంలోని తిరుపతి శృంగారవల్లభస్వామి వారిని భక్తులు శనివారం దర్శించుకున్నారు. తెల్లవారుజాము నుంచే భక్తులు స్వామి దర్శనానికి బారులు తీరారు. టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.94,380 అన్నదాన విరాళాలు రూ.42,571 ఆదాయం, కేశఖండన ద్వారా రూ.5,920, తులాభారం ద్వారా రూ.300, లడ్డూ ప్రసాదం విక్ర యం ద్వారా రూ.19,275 వెరసి రూ.1,62,446 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో వడ్డి శ్రీనివాస రావు తెలిపారు. ఆలయానికి వచ్చే భక్తులకు పులిహోర, అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. సుమారు 9వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించినట్లు దేవస్థానం అధికారులు తెలిపారు. ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, నారాయణాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

వర్కింగ్ ప్రొఫెషనల్స్‌కు డిప్లమో కోర్సు

గైట్ పాలిటెక్నిక్‌లో అభ్యసనకు ప్రభుత్వ అనుమతి

రేపటి నుంచి అడ్మిషన్లు


వివరాలు వెల్లడిస్తున్న రిజిస్ట్రార్ శర్మ, శ్రీనివాసరావు

రాజానగరం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగాలుచేస్తూ, డిప్లమో కోర్సు అభ్యసించాలనుకునే వారికోసం గైట్ పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లమో కోర్సులను ప్రారంభిం చినట్టు గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ పీఎంఎంఎస్ శర్మ, డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా శనివారం వారు మాట్లాడుతూ 2024-25 విద్యా సంవత్సరంలో వర్కింగ్ ప్రొఫెషనల్స్ కోసం గైట్ పాలిటెక్నిక్ కళాశాల ఈ కోర్సులను అందిస్తోందన్నారు. డిప్లమో కోర్సులో చేరేందుకు ఇంటర్మీడియట్ ఎంపీసీ గ్రూపుతో ఉత్తీర్ణులై ఉండాలన్నారు. పదో తరగతి ఉత్తీర్ణత సాధించి రెండేళ్ల పాటు ఐటీఐ పూర్తిచేసిన వారిని కూడా అర్హులుగా పరిగణిస్తామన్నారు. ఉమ్మడి గోదావరి జిల్లాల్లో తమ కళాశాలకు మాత్రమే ప్రభుత్వ అనుమతులు లభించాయని చెప్పారు. లేట్రల్ ఎంట్రీ విద్యార్థులు మాదిరిగానే వీరు కూడా నేరుగా ద్వితీయ సంవత్సరం పాలిటెక్నిక్ కోర్సు లో ప్రవేశిస్తారని, పాలిటెక్నిక్ కోర్సును రెండేళ్లపాటు మాత్రమే అభ్యసించాల్సి ఉంటుందన్నారు. ఈనెల 21నుంచి 26వ తేదీ వరకు అడ్మిషన్ల ప్రక్రియ జరుగుతుందన్నారు. మరిన్ని వివరాల కోసం గైట్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ పీజీ రామానుజం మొబైల్ నెం. 8886660481ను సంప్రదించవచ్చన్నారు.

దివ్యాంగుల ఆదర్శ వివాహం

ప్రేమించుకుని ఒక్కటైన జంట


పెద్దల సమక్షంలో ఒక్కటైన ప్రేమజంట

మండపేట, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ఔను వాళ్లు ఇద్దరూ ఇష్టపడ్డారు. దివ్యాంగులైనా.. కులాలు వేరైనా.. వారి ప్రేమను ఎవరూ విడదీయలేరని తాము పెళ్లిచేసుకునేందుకు ఇష్టపడినా వధువు కుటుంబ సభ్యులు కుదరదని చెప్పటంతో ఇరువురు పెద్దలను ఆశ్రయించి ఆదర్శ వివాహం చేసుకున్న జంట ఉదంతమిది. అంబేడ్కర్ కోనసీమజిల్లా కపిలేశ్వరపురం మండలం వడ్లమూరుకు చెందిన వేములపూడి ప్రసాద్ (32) బీసీ కులస్థుడు, కె.గంగవరం మండలం పాణింగపల్లికి చెందిన లంకమంగమ్మ (31) ఎస్సీ ఇరువురు అమలాపురంలో రెండేళ్లక్రితం సదరన్ వైద్యపరీక్షల కోసం వెళ్లిన సమయంలో ఇద్దరికీ పరిచయం ఏర్పడింది. వారిద్దరి మధ్య ప్రేమ చిగురించింది. స్నేహం కాస్త ప్రేమగా మారింది. ఇద్దరివి వేర్వేరు కులాలు కావడంతో యువతి కుటుంబ సభ్యులు వివాహానికి అంగీకరించలేదు. దీంతో ఇద్దరూ కలిసి మండపేట పట్టణానికి చెందిన ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు దూళి జయరాజు, వీహెచ్‌పీఎస్ దివ్యాంగుల పోరాట సమితి నాయకులను జంట ఆశ్రయించారు. దాంతో వారు యువజంటకు అండగా నిలిచి యువతి తల్లితో మాట్లాడి వివాహం జరిగేలా చేశారు. క్రైస్తవ మతానుసారం శనివారం మండపేట పట్టణంలో ఇద్దరికీ ఆదర్శ వివాహం చేశారు. కులాంతర వివాహం చేసుకున్న వారికి ప్రభుత్వం ప్రోత్సాహం అందించి ఆదుకోవాలని నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. పట్టణంలోని సంఘం కాలనీలోని చర్చిలో చర్చికాపరి పాస్టర్ గాబ్రియేల్ దివ్యాంగ జంటకు వివాహం జరిపించారు. జంటను దివ్యాంగ సంఘ నాయకుడు షేక్ నబీతోపాటు ఎమ్మార్పీఎస్ నాయకులు గాలింకి నాగేశ్వరరావు, కృష్ణమూర్తి, సూరిబాబు, విజయ్‌భవాని, చిట్టెమ్మ, శివ ఆశీర్వదించారు.

మన్యం పంచాయతీ
సర్పంచ్‌లకు యమ గిరాకీ

మద్యం షాపుల గ్రామసభల తీర్మానానికి సిండికేట్ల బేరసారాలు

మెజార్టీ పంచాయతీలు వైసీపీ చేతుల్లోనే ఉండటంతో వైసీపీ పెద్దల నుంచీ వత్తిడి

రంపచోడవరం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మన్యంలోని మండల కేంద్రాల గ్రామ పంచాయతీ సర్పంచ్‌లకు మద్యం షాపుల పుణ్యమాని విపరీతమైన గిరాకీ పెరిగింది. ముందస్తు గ్రామసభల ఆమోదాలు లేకుండానే ఆయా మండలాల్లో మద్యం షాపుల ఏర్పాటుకు నోటిఫికేషన్ జారీచేసి షాపులను కేటాయించడం వివాదంగా మారిన సంగతి తెలిసిందే! దీనిపై పలు గిరిజన సంఘాలు, కూటమి భాగస్వామ్యమైన బీజేపీ అనుబంధ గిరిజన నాయకులు ప్రభుత్వానికి ఫిర్యాదులు చేసి స్థానిక ఎమ్మెల్యేపై వత్తిడి పెంచి, ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో గ్రామసభల తీర్మానాలు ఉంటేనే షాపులు తెరవాలని అధికారులు మద్యం షాపుల లైసెన్స్‌లకు తేల్చి చెప్పారు. దీంతో ఆయా మద్యం షాపుల సిండికేట్లు వైసీపీ, టీడీపీల్లో తమకు ఉన్న రాజకీయ పలుకుబడిని ఉపయోగించి ఆయా పంచాయతీల నుంచి మద్యం షాపులకు అనుకూలంగా తీర్మానాలను తెచ్చుకునే ప్రయత్నాలు చేస్తున్నారు.

మెజార్టీ పంచాయతీలన్నీ వైసీపీ ఖాతాలోనే

మన్యంలో మెజార్టీ పంచాయతీలన్నీ వైసీపీ ఖాతాలోనే ఉండటంతో సిండికేట్లలోని మైదానప్రాంత వైసీపీ అనుయాయులు తమ మాజీ ఎమ్మెల్యేలతో ఇక్కడున్న వైసీపీ నేతలకు, ఆయా పంచాయతీ సర్పంచ్‌లకు చెప్పించుకుంటూ తీర్మానాలను చేసేందుకు సిద్ధమవుతున్నారు. అంతేకాకుండా అనువుగానిచోట ఆయా సర్పంచ్‌లతో బేరసారాలను కూడా సాగిస్తున్నారు. విచిత్రమేమంటే ఓ పంచాయతీ సర్పంచ్ అయితే షాపు ఏర్పాటుచేసే ప్రాంతం తన పరిధిలోనిది కాకపోయినా కూడా షాపు ఏర్పాటుకు గ్రామసభ తీర్మానం జరిగినట్లు లేఖలను కూడా ఇచ్చేశారు. ఆ మేరకు షాపును తెరిస్తే అభ్యంతరం రావడంతో తర్వాత దానిని మూయించేశారు. ఇదిలావుండగా కొన్ని పంచాయతీలలో ఈ షాపుల ఏర్పాటు కోసం ప్రత్యేకంగా నిర్దేశిత పీసా గ్రామసభలను నిర్వహించకుండానే నిర్వహించినట్టు చూపి లేఖలు ఇచ్చేసే ప్రక్రియ కూడా జరిగింది. ఈవిధంగా ఎక్సైజ్ అధికారుల అత్యుత్సాహంతో ముందస్తు తీర్మానాలు లేకుండా షాపులను కలెక్టరుతో కేటాయింపచేసి న్యాయపరమైన చిక్కులు తలెత్తేలాచేసి ఇపుడు ప్రభుత్వాన్ని సైతం ఇబ్బందుల్లో నెట్టేసిన పరిస్థితిని అధిగమించడానికి అధికారులు తీవ్రస్థాయిలో ప్రయత్నాలు సాగిస్తున్నారు.

జనసేనలో చేరిన ముద్రగడ కుమార్తె



డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సమక్షంలో జనసేనలో చేరుతున్న ముద్రగడ కుమార్తె క్రాంతి ఆమె భర్త రవికిరణ్

కిర్లంపూడి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం కుమార్తె బార్లపూడి క్రాంతి శనివారం జనసేన పార్టీలో చేరారు. ఈ సందర్భంగా రాష్ట్ర జనసేన కార్యాలయంలో క్రాంతి, ఆమె భర్త రవికిరణ్‌కు జనసేన అధినేత, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. అయితే గత ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం తరపున తుని సభలో పవన్‌కల్యాణ్ పాల్గొన్నప్పుడు పార్టీలో చేరేందుకు ముద్రగడ కుమార్తె సిద్ధపడ్డారు. అప్పటి పరిస్థితుల్లో పవన్‌కల్యాణ్ చేరికను సున్నితంగా తిరస్కరించారు. రాబోయే రోజుల్లో పార్టీలో చేర్చుకుంటామని హామీ ఇచ్చారు. దీనిలో భాగంగా జనసేన కేంద్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో క్రాంతి కుటుంబసభ్యులు జనసేనలో చేరారు.

ట్రాక్టర్ ఢీకొని మోటార్ సైక్లిస్టు మృతి

రాజానగరం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో నరేంద్రపురం గ్రామ శివారులో శుక్రవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. కోరుకొండ గ్రామానికి చెందిన ముమ్మిడివరపు రామానుజ సునీల్ (34) నరేంద్రపురం పరిధిలోని ఐశ్వర్య రైస్‌మిల్లులో పనిచేస్తుంటాడు. శుక్రవారం రైస్‌మిల్లులో విధులు ముగించుకుని టీవీఎస్ మోపెడ్‌పై ఇంటికి వెళ్తుండగా మార్గ మధ్యలో నరేంద్రపురం గ్రామశివారులో ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో సునీల్‌కు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలో శవపంచనామా అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్ప గించారు. రాజానగరం ఎస్‌ఐ కేసు నమోదు చేశారు.

అదృశ్యమైన మహిళ
శవమై తేలింది


రౌతు కస్తూరి (ఫైల్)

కడియం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): కూలిపనికి వెళ్లి కనిపించకుండా పోయిన మహిళ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం చొప్పెల లాకులవద్ద శవమై తేలిన ఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. బుర్రిలంక గ్రామానికి చెందిన రౌతు కస్తూరి(43) ఈనెల 15న కూలిపనికి వెళ్లింది. సాయంత్రం వరకు చూశారు. ఎంతకీ రాకపోవడంతో 16న కస్తూరి భర్త పాపారావు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు. 17న మృతదేహం చొప్పెల్ల లాకుల వద్ద ఉన్నట్టు సమాచారం రావడంతో కస్తూరి కుటుంబ సభ్యులు లాకుల వద్దకు వెళ్లి చూడగా ఆ మృతదేహం కస్తూరిగానే గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం చేయించి బంధువులకు అప్పగించారు. కాగా పాపారావు మొక్కల ఎగుమతులు కూలీగా పనిచేస్తుంటాడు. వీరికి ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఇదిలావుండగా కస్తూరి మృతదేహం లాకులవద్ద చూసేసరికి గుండు కొట్టి ఉండడం, వంటిపై వస్త్రాలు లేకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.

పాముకాటుకు ఎనిమిదేళ్ల చిన్నారి బలి


మృతిచెందిన ఉషశ్రీ

కరప, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కరప మండలం సిరిపురంలో శనివారం ఉదయం పాము కరిచి ఎనిమిదేళ్ల చిన్నారి మృతిచెందింది. స్థానికులు, కరప పోలీసులు తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. సిరిపురం ఎస్సీపేటకు చెందిన పూలపల్లి నాగరాజు కుమార్తె ఉషశ్రీ(8) స్థానిక ప్రభుత్వ పాఠశాలలో 2వ తరగతి చదువుతోంది. శనివారం ఉదయం ఉషశ్రీ విపరీతమైన జ్వరం, ఫిట్స్‌తో బాధపడుతుండగా కంగారు పడిన నాగరాజు 108 అంబులెన్స్‌లో కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఉషశ్రీని పరీక్షించిన వైద్యుడు గుర్తుతెలియని పాము ఆమె ఎడమ కాలిపై కాటువేసినట్టుగా అనుమా నం వ్యక్తంచేశాడు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం మృతి చెందినట్టు వైద్యులు ధృవీకరించారు. నాగరాజు పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తుండగా అతని భార్య జ్యోతి కువైట్‌లో ఉంటుంది. వీరికి సంతానం లేకపోవడంతో నాగరాజు హైదరాబాద్‌లో ఉంటున్న తన సోదరి కుమార్తె ఉషశ్రీను పెంచుకుంటున్నట్టు తెలిసింది. ఎంతో అల్లారుముద్దుగా పెంచుకుంటున్న కుమార్తె అకస్మాత్తుగా మృత్యువాత పడడంతో నాగరాజు తీవ్రంగా విలపిస్తున్నాడు. దీనిపై కరప ఎస్‌ఐ తోట సునీత కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

వెబ్‌సైట్‌లో కేజీబీవీ బోధనా సిబ్బంది మెరిట్ లిస్ట్

కాకినాడరూరల్, అక్టోబరు 19: ఏపీ సమగ్ర శిక్షా సొసైటీ (పాఠశాల విద్యాశాఖ) ద్వారా నిర్వహించబడుతున్న కస్తుర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న బోధనా సిబ్బంది ధ్రువపత్రాల పరిశీలన అనంతరం తుది మెరిట్ లిస్టును ఎస్ఎస్ఏ వెబ్‌సైట్‌లో ఉంచినట్లు అదనపు పథక సమన్వయకర్త, డీఈవో పి.రమేష్ తెలిపారు. మెరిట్‌లిస్టును ssaegdt.webnode.comలో అందుబాటులో ఉంచామన్నారు. అభ్యర్థులు ఈ మెరిట్‌లిస్ట్‌లో వారికి సబ్జెక్టుల్లో ఏటువంటి అభ్యంతరాలున్నా ఈనెల 21 సాయంత్రం 5గంటలలోపు తెలపాలన్నారు.

సాధనతో విజయాలు సాధ్యం

రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ

ఏపీ అంతర్ జిల్లాల రైఫిల్ షూటింగ్ టోర్నమెంట్

అండర్-14, 17, 19 బాల, బాలికల పోటీలు


రైఫిల్ షూటింగ్ పోటీలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ

దివాన్‌చెరువు, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి): సాధన, ఏకాగ్రత, తర్ఫీదు ఉంటే ఏ రంగంలోనైనా విజయాలు సాధ్యమవుతాయని రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. ఏపీ పాఠశాల విద్యాశాఖ, క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలం సంపత్‌నగరంలోని రాజమహేంద్రి ఇంటర్నేషనల్ స్కూల్‌లో 68వ ఏపీ అంతర్ జిల్లాల రైఫిల్ షూటింగ్ టోర్నమెంట్ 2024-25ను ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజమహేంద్రి స్కూల్ చైర్మన్ టీకే విశ్వేశ్వరరెడ్డి అధ్యక్షతన జరిగిన ప్రారంభోత్సవ సభలో ఎమ్మెల్యే బత్తుల మాట్లాడుతూ మెరిసే ధృవతారలా ప్రపంచ క్రీడారంగంలో నిలవాలంటే నిత్యసాధనతోపాటు ఏకాగ్రత అవసరమన్నారు. క్రీడల్లో విజయాలతో స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు వస్తాయని చెప్పారు. క్రీడలకు నిధులు, తగిన ప్రోత్సాహం అందించేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య కార్యదర్శి ఎస్ఆర్‌కేవీ స్వామి మాట్లాడుతూ ఈ రైఫిల్ టోర్నమెంట్ అండర్-14, 17, 19 బాల, బాలికల విభాగంలో నిర్వహిస్తున్నామని, మూడురోజులపాటు పోటీలు జరుగుతాయని చెప్పారు. ఇక్కడ ఎంపికైన విజేతలు భోపాల్‌లో జరిగే జాతీయ పోటీలకు అర్హత సాధిస్తారని తెలిపారు. ఈ పోటీలకు 13 ఉమ్మడి జిల్లాల నుంచి 380 మంది క్రీడాకారులు, మేనేజర్లు, కోచ్‌లు 80 మంది, 250 మంది తల్లిదండ్రులు వచ్చారని చెప్పారు. డీఈవో కె.వాసుదేవరావు మాట్లాడుతూ క్రీడలు ఆడితే ఆరోగ్యం బాగుంటుందని, ఏకాగ్రత కూడా కుదురుతుందన్నారు. అనంతరం క్రీడాకారుల నుంచి ఎమ్మెల్యే క్రీడావందం స్వీకరించి, క్రీడాజ్యోతిని అందుకుని వెలిగించారు. కార్యక్రమంలో క్రీడా సమాఖ్య సహాయ కార్యదర్శి రాధాకృష్ణ, డీవైఈవో నారాయణ, రాజానగరం సీఐ వీరయ్యగౌడ్, రాజమహేంద్రి స్కూల్ డైరెక్టర్ టి.స్వరూప్‌రెడ్డి, ప్రిన్సిపాల్ టి.చంద్రశేఖర్, ఎంపీటీసీ సదానందకిశోర్ పాల్గొన్నారు.

క్రీడలతోనే దేశానికి మంచిపేరు: చైర్‌పర్సన్ రాణి

● నన్నయ యూనివర్సిటీ కళాశాలల విద్యార్థుల కబడ్డీ పోటీలు ప్రారంభం

మండపేట, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): క్రీడలతోనే దేశానికి మంచిపేరు వస్తుందని విద్యార్థి దశ నుంచి చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూకదుర్గారాణి అన్నారు. మండపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం ఆదికవి నన్నయ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ కళాశాలల పురుషుల విభాగంలో రెండు రోజులపాటు జరిగే కబడ్డీ పోటీలను ఆమె ప్రారంభించారు. కళాశాల ప్రిన్సిపాల్ కె.టి.టి.వి.శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మండపేటలో తొలిసారిగా నన్నయ యూనివర్సిటీ పరిధిలో కళాశాలల కబడ్డీ పోటీలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. కళాశాల పీడీ వీరాంజనేయులు మాట్లాడు తూ ఈ పోటీలు శని, ఆదివారం జరుగుతాయన్నారు. ఈ పోటీల్లో యూనివర్సిటీ పరిధిలోగల 16 కళాశాలల నుంచి విద్యార్థులు పాల్గొంటారన్నారు. విజేతలకు ఆదివారం సాయంత్రం బహుమతులు అందిస్తామన్నారు. సెలెక్షన్ కమిటీ ఎంపికచేసిన క్రీడాకారులను చెన్నైయ్‌లో జరిగే పోటీలకు పంపిస్తామన్నారు. తొలిరోజు కబడ్డీ పోటీల్లో 8జట్లు పాల్గొన్నా యి. కార్యక్రమంలో మారేడుబాక సర్పంచ్ ఎం.గోవిందరాజు, కబడ్డీ సెలెక్షన్ కమిటీ సభ్యులు డాక్టర్ బి.వి.నరసింహరాజు, డాక్టర్ ఎం.వి.వి. ఎస్.ఎస్.మూర్తి, కె.ప్రభాకరరావు, వివిధ కళాశాలల వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు, అధ్యాపకులు ఆనంద్, కె.ఎస్.ఆర్.దిలీప్, చంటి, రాజేష్ పాల్గొన్నారు.


మండపేటలో కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ రాణి, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, తదితరులు

అయినవిల్లిలో 67.6 మిల్లీమీటర్ల వర్షపాతం

అమలాపురంటౌన్, అక్టోబరు19(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సగటున 16.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదుకాగా అత్యధికంగా అయినవిల్లిలో 67.6 మిల్లీమీటర్లు, అత్యల్పంగా కాట్రేనికోనలో 0.6మిల్లీమీటర్లు నమోదైంది. మండలాల వారీగా ఆత్రేయపురం1, కొత్తపేట5.4, కపిలేశ్వరపురం 2, కె.గంగవరం, 20.4, ఐ.పోలవరం 33.6, ముమ్మిడివరం53.6, పి.గన్నవరం 13.8, అంబాజీపేట 30.6, మామిడికుదురు26.8, రాజోలు7.2, మలికిపురం 15.4, సఖినేటిపల్లి16.2, అల్లవరం4.6, ఉప్పలగుప్తం30.2, అమలాపురం 37.

• విద్యార్థులకు అల్పాహారం అందిస్తామన్న నిర్వాహకులు • వంటశాలను పరిశీలించిన బండారు • వేదపండితుల హోమాలు, పూజలు

ఆరోగ్య కేంద్రానికి అనారోగ్య సమస్యలు

• పీహెచ్‌సీలో తాగునీటి సమస్య
• ల్యాబ్ టెక్నీషియన్ కాకినాడ బదిలీ
• కుక్కకాటు మందు కొరత





ఆయుష్మాన్ ఆరోగ్య మందిరం, ఆరోగ్య మందిరం ప్రాంగణంలో మురుగునీరు, మోటార్లతో నీరు తరలించుకుపోతున్న దృశ్యం

అయినవిల్లి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): అయినవిల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అనారోగ్య సమస్యలు నెలకొన్నాయి. చుట్టూ వర్షపు నీటిలో ముంపు పెరిగిపోయి దోమలకు ఆవాసాలుగా మారాయి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేసే ల్యాబ్ టెక్నీషియన్‌ను కాకినాడకు బదిలీ చేశారు. దాంతో రోగులకు ఫీవర్ పరీక్షలు, ప్లేట్‌లెట్, టైఫాయిడ్ టెస్ట్‌లు చేయలేకపోతున్నారు. రోగులు పరీక్షల కోసం ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తుందని, రోగాలు ముదిరిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతీరోజు పీహెచ్‌సీకి 150 మంది వరకు రోగులు వచ్చి వైద్య సేవలు పొందుతున్నారు. ఇద్దరు వైద్యులు వైద్య సేవలు అందిస్తున్నారు. పీహెచ్‌సీ నూతన భవనానికి గత కొన్నేళ్లుగా విద్యుత్ స్తంభం ఏర్పాటుచేసి సరఫరా కల్పించాలని విద్యుత్‌శాఖ అధికారులను వేడుకుంటున్నా ఇంత వరకు కార్యరూపం దాల్చలేదు. పాల బిల్డింగు నుంచి కొత్త భవనం వరకు అండర్ కరెంటు ఏర్పాటు చేశారు. దాంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఫ్రిజ్‌లు కాలిపోతున్నాయని సిబ్బంది చెబుతున్నారు. పీహెచ్‌సీ పరిధిలో పదకొండు గ్రామ సచివాలయాలు ఉన్నాయి. అయినవిల్లి-1, 2, ముడుపల్లి, వెలువలపల్లి, అయినవిల్లిలంక, నేదునూరు-1, 2, నల్లచెరువు, సిరిపల్లి, విలస-1, 2 గ్రామాలు పీహెచ్‌సీ పరిధిలోనే ఉన్నాయి. అయినవిల్లి పీహెచ్‌సీలో వైద్యసేవలు బాగుండడంతో ఇతర గ్రామాలు, మండలాల నుంచి సైతం రోగులు రావడం విశేషం. కుక్కకాటు మందులు, డయాబెటీస్ మందులు, సెలైన్ కొరత ఏర్పడుతుంది. సచివాలయాలు ఏర్పడ్డాక గ్రామ స్థాయిలో ఏఎన్‌ఎంలు వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో లేకపోవడంతో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయన్నారు. పీహెచ్‌సీలో రోగులకు 52 రకాల మందులు అందిస్తున్నారు. బీసీ, షుగర్, యాంటీబయాటిక్ మందులు ప్రభుత్వం సరఫరా చేస్తుంది. గత వైసీపీ ప్రభుత్వంలో పీహెచ్‌సీలకు మందులు పంపిణీ చేస్తామన్న వాగ్దానం నీరుగారింది. తాగునీటి సమస్య ఉంది. నూతనంగా నిర్మించిన భవనానికి తాగునీటి పైపులైన్లు లేకపోవడంతో ఆరోగ్య కేంద్రం గేటు సమీపంలో ట్యాంకు తవ్వి పీహెచ్‌సీ పాత భవనానికి, కొత్త భవనానికి మోటార్లద్వారా నీటినితరలిస్తున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ముంపునీరు డ్రైనేజీ ఏర్పాటుచేసి ముంపును తొలగించాలి. ఆరోగ్య కేంద్ర భవనానికి విద్యుత్‌స్తంభం ఏర్పాటుచేసి సరఫరా పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు.

పొడగట్లపల్లిలో అన్నక్షేత్ర వంటశాల ప్రారంభం



నిర్వాహకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు

రావులపాలెం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): పొడగట్లపల్లిలో హరే కృష్ణ మూమెంట్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో ఏర్పాటుచేసిన అన్నక్షేత్ర వంటశాలను శనివారం ప్రారంభించారు. ఈసందర్భంగా ముందుగా వేదపండితులు హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వంటశాలను అవంతి ఫీడ్స్ చైర్మన్ అల్లూరి ఇంద్రకుమార్, స్థలదాత మంగిపూడి కృష్ణశాస్త్రి ప్రారంభించారు. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు వంటశాలను పరిశీలించి తయారీ విధానం వినియోగిస్తున్న తీరుపై వారితో చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు మాట్లాడుతూ ఆధ్యాత్మిక సేవా రంగాల్లో విశేష సేవలు అందిస్తున్న హరే కృష్ణ మూమెంట్ సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వం నిర్వహిస్తున్న అన్నక్యాంటీన్‌కు నాణ్యమైన ఆహారం అందించడం శుభపరిణామమన్నారు. అవంతి ఫీడ్స్ చైర్మన్ ఇంద్రకుమార్ మాట్లాడుతూ సామాజిక సేవారంగాలలో ఖ్యాతిగాంచిన హరేకృష్ణ మూమెంట్ సంస్థ ఆహారం అందించాలనే సంకల్పంతో సేవా రంగంలో మరో అడుగు ముందుకు వేయడం అభినందనీయమన్నారు. నిర్వాహకులు మాట్లాడుతూ పొడగట్లపల్లిలో నిర్వహిస్తున్న అన్నక్షేత్రం ద్వారా జిల్లాలో ఆసుపత్రుల్లోని రోగులకు, ప్రభుత్వ పాఠశాలల్లోని చిన్నారులకు రోజు మధ్యాహ్న భోజనంఅందిస్తున్నామన్నారు. వంటశాలకు అవంతి ఫీడ్స్ చైర్మన్ డాక్టర్ అల్లూరి ఇంద్రకుమార్ రూ.1.2కోట్లు విరాళం అం దించారన్నారు. మంగిపూడి కృష్ణశాస్త్రి సీతమ్మ ట్రస్టు స్థలం సమకూర్చిందన్నారు.భవిష్యత్‌లో ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు అల్పాహారం అందించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. హరేకృష్ణ మూ మెంట్ అధ్యక్షుడు డాక్టర్ నిష్రించిన భక్తదాస అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆర్డీవో శ్రీకర్, తహసీల్దారు ముక్తేశ్వరరావు, సంస్థ సభ్యులు వైకుంఠేశ్వరరావుదాత, సుఖి సాగర్ దాత, శ్యామ్ మాధవ్‌దాత, సర్పంచ్ గంధందేవి అన్న వరం, ఎంపీటీసీ శకినాల నాగజ్యోతి, గోపిశెట్టి సత్తిపండు, బండారు శ్రీను, వెలుగొట్ల త్రిమూర్తులు, కార్యదర్శి సుధాకర్ పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న నలుగురి అరెస్టు

యానాం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): గంజయా విక్రయిస్తున్న నలుగురు నిందుతులనుఅరెస్టు చేసినట్టు యానాం ఎస్పీ రాజశేఖరన్ తెలిపారు. యానాం రీజెన్సీ పరిశ్రమ వెనుకరోడ్డులో పాఠశాల సమీపంలో గంజాయి విక్రయిస్తున్న నలుగుర్ని ఎస్ఐ మురుగునాందం, క్రైమ్‌సిబ్బంది అరెస్టుచేశారు. వీరిలో ఫెర్రీరోడ్డుకు చెందిన సంగాడి మహేష్‌బాబు, తాళ్లరేవుమండలం సీతారామపురానికి చెందిన గెడ్డం రాజు, అయ్యన్ననగర్‌కు చెందిన పెసింగి నాని, పెనుపోతు విజయదుర్గావర ప్రసాద్ ఉన్నారు. 500గ్రాములు గంజాయి, ద్విచక్రవాహనం, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులకు కోర్టు రిమాండ్ విధించింది. సీఐ షణ్ముగం, క్రైంసిబ్బంది పాల్గొన్నారు.

అసభ్య ప్రవర్తనపై కేసు నమోదు

కాట్రేనికోన, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): కాట్రేనికోన జిల్లెళ్ళవారిపేటకు చెందిన వాకపల్లి ఏసు తన కమార్తె పట్ల పదేపదే అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని అదే పేటకు చెందిన బాలిక తల్లి శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. తన కుమార్తెను లైంగికంగా వేధిస్తూ, నలుగురిలో అవమానపరుస్తున్న ఏసుపై చర్యలు తీసుకోవాలని కోరింది. కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ అవినాష్ తెలిపారు.

రేపు డీసీసీబీ కార్యాలయం ఎదుట ధర్నా

అమలాపురం టౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): దశాబ్దాల కాలంగా ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోరుతూ కాకినాడలోని డీసీసీబీ కార్యాలయం ఎదుట సోమవారం చేపట్టే ధర్నాలో ఉద్యోగులంతా పాల్గొని విజయవంతం చేయాలని యూనియన్ జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యర్రంశెట్టి రామచంద్రరావు, పెంకే సత్యనారాయణ పిలుపునిచ్చారు. జీవో నెం.36, 90 ప్రకారం వేతనాలు, ఇతర బెనిఫిట్స్ వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. 2019 ఏప్రిల్ 1నాటి వేతన సవరణ అమలు చేయుట తదితర అంశాలపై ధర్నా చేస్తున్నట్టు చెప్పారు.

ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలి

అల్లవరం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆధార్ మొబైల్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో కృష్ణమోహన్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద శనివారం సమీక్ష సమావేశం జరిగింది. ఈనెల 22 నుంచి గ్రామాల్లో నిర్వహించే ఆధార్ మొబైల్ క్యాంపులకు ఆధార్ కార్డు లేనివారు, పేరు మార్పులు, వంటి వాటి వారికి సమాచారం అందించాలన్నారు. ప్రజా ప్రతినిధుల సహకారంతో క్యాంపులను విజయవంతం చేయాలన్నారు. ఈనెల22న ఓఎన్‌జీసీ నిర్వహించే ప్రజాభిప్రాయ సేకరణపై సమాచారంఇవ్వాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీటిపై దృష్టిసారించాలన్నారు. ఈవోపీఆర్డీ యు.నాగేంద్ర, కార్యదర్శులు, డిజిటల్‌అసిస్టెంట్లు పాల్గొన్నారు.

కుప్పకూలిన భారీ వృక్షం

పి.గన్నవరం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): రాజవరం-పొదలాడ ప్రధాన రహదారి చాకలిపాలెం వద్ద అన్నక్యాంటీన్ సమీపంలో భారీ వర్షానికి భారీ వృక్షం కుప్పకూలింది. దీంతో ట్రాఫిక్‌కు రెండు గంటలు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ప్రత్యామ్నాయ రహదారి లేకపోవడంతో వాహనదారులకు, ప్రయాణికులకు అవస్థలు తప్పలేదు. చెట్టు విద్యుత్ తీగలపై పడటంతో సరఫరాకు అంతరాయం ఏర్పడింది. సర్పంచ్ పత్తిపాటి ఉమామహేశ్వరి చొరవతో పంచాయితీ సిబ్బంది, స్థానికులురెండు గంటల కష్టపడి చెట్టు కొమ్మలను తొలగించారు.

సమగ్ర సస్యరక్షణ చర్యలపై అవగాహన కలిగి ఉండాలి

పి.గన్నవరం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): సమగ్ర సస్యరక్షణ చర్యలపై రైతులకు క్షేత్రస్థాయిలో సూచనలు అందించడానికి వీఏఏలు సిద్ధంగా ఉండాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి వి.బోసుబాబు తెలిపారు. పి.గన్నవరం రైతుసేవా కేంద్రంలో వీఏఏలకు జరిగిన శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పురుగులు, తెగుళ్లపై రైతులను అప్రమత్తంచేసి సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. నవంబరు మొదటి వారం నుంచి కోతలు ప్రారంభమవుతాయని, డిసెంబరు నుంచి అన్ని ప్రాంతాల్లో పంటలు కోతకు వస్తాయన్నారు. అనంతరం జిల్లా వనరుల కేంద్రం ఆరోకేవీకై రాప్తార్ ఏడీఏ ఎ.రాజశేఖర్, ఏరువాక శాస్త్రవేత్త ఎం.నంద కిషోర్ ఆధ్వర్యంలో వీఏఏలకు వరి పంటల్లో సమగ్ర సస్యరక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సబ్‌డివిజన్ ఏడీఏ ఎస్‌జేవీ రామ్మోహనరావు, మండల వ్యవసాయశాఖ అధికారులు సీహెచ్ విజయ్‌కుమార్, బి.మృదుల, ఏఈవోలు, సిబ్బంది పాల్గొన్నారు.

పల్లెసీమల అభివృద్ధికే పల్లె పండుగ






అమలాపురం: కామనగరువులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే ఆనందరావు, అంబాజీపేట: పుల్లేటికుర్రులో రహదారికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, రాజోలు: కడలిలో సమావేశంలో మాట్లాడుతున్న రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, అల్లవరం: కోడూరుపాడు పల్లె పండగలో ఎమ్మెల్యే ఆనందరావు

• ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు
• పలుచోట్ల పల్లెపండుగ కార్యక్రమాలు

అమలాపురం రూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పల్లెసీమల అభివృద్ధికే కూటమి ప్రభుత్వం 'పల్లె పండుగ' చేపట్టిందని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పేర్కొన్నారు. పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా శనివారం ఇమ్మిడివరప్పాడు, రోళ్ళపాలెం, తాండవపల్లి, చిందాడగరువు, కామనగరువు, రెడ్డిపల్లి గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణంతో పాటు పలు అభివృద్ధి పనులకు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబుతో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు మల్లుల పోల య్య, అల్లవరం మండల శాఖ అధ్యక్షుడు దెందుకూరి సత్తిబాబు రాజు, సర్పంచ్‌లు రేలంగి దుర్గారావు, మట్టా వైదేహి, గంగుమళ్ళ ఏసుబాబు, పొనకల గణేష్, కరాటం రత్నప్రసన్న, మాజీ ఎంపీపీ బొర్రా ఈశ్వరరావు, మాజీ జడ్పీటీసీ అధికారి జయవెంకటలక్ష్మి, మంద గెద్దయ్య, ముత్తాబత్తుల రమణ, మోటూరి కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ రహదారులకు మహర్దశ

అంబాజీపేట, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పల్లె పండుగతో గ్రామీణ ప్రాంతాల రహదారులకు మహర్దశ కలుగుతుందని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. పల్లె పండగ సందర్భంగా పసుపల్లి, వక్కలంక, పుల్లేటికుర్రు, ఇరుసుమండ, మొసలపల్లి, ఇరుసుమండ, గంగలకుర్రు అగ్రహారం గ్రామాల్లో పలు రహదారుల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఉపాధి హామీ నిధుల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో సీసీరోడ్లను నిర్మిస్తామన్నారు. జడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, ఎంపీడీవో జీవీ సరోవర్, జేఈ సీహెచ్ రవి, ఏపీవో అడపా కృష్ణ, సర్పంచ్‌లు మట్టపర్తి నాగరాజు, వాసంశెట్టి రేవతిపెదబాబు, జల్లి బాలరాజు, అక్కిశెట్టి నాగమణి పెద్ద కాండ్రేగుల శ్రీనివాసరావు, దొంగ నాగేశ్వరరావు, నాయకులు గణపతి వీరరాఘవులు, శిరిగినీడి వెంకటేశ్వరరావు, వాసంశెట్టి కుమార్, చిన్నం బాలవిజయరావు, వాసంశెట్టి వరలక్ష్మి, బొంతు పెదబాబు, కొర్లపాటి గోపి, నాగాబత్తుల వెంకటసుబ్బారావు, మానేపల్లి శ్రీనివాసరావు, అరిగెల సూరిబాబు, దొమ్మేటి సాయికృష్ణ, మట్టపర్తి చంద్రశేఖర్, బోనం నాని ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కూటమి పాలనలో గ్రామాల్లో ప్రగతి

అల్లవరం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): కూటమి పాలనలో పంచాయతీలు ప్రగతి పథంలో నడుస్తున్నాయని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. పల్లె పండు గలో భాగంగా మండలంలోని కోడూరుపాడు, తాడికోన, గూడా ల గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి శనివారం ఆయన శంకు స్థాపన చేశారు. టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు దెందుకూరి సత్తిబాబు రాజు, సర్పంచ్‌లు నడింపల్లి సుబ్బరాజు, దాకారపు చిరంజీవిరావు, సాధనాల సూర్యవెంకట నాగమణి, పంచాయతీరాజ్ డీఈఈ ఎస్.రాజకుమార్, ఎంపీడీవో బీఎస్ఎస్ కృష్ణమోహన్, వేగి రాజు వెంకట్రాజు, పంపిరెడ్డి కాశీ, పచ్చిమాల ఏడుకొండలు, తిక్కిరెడ్డి శ్రీనివాస్, కేవీ, పోలిశెట్టి భాస్కరరావు, సాధ నాల గోవిందరాజు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికే పల్లె పండుగ

రాజోలు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికే రాష్ట్ర ప్రభుత్వం పల్లెపండుగ నిర్వహిస్తోందని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. కూనవరం, వేగివారిపాలెం, కడలి, అరవపాలెం, బి.సావరం, పాలగుమ్మి గ్రామాల్లో పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా శనివారం పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపనలు చేశారు. పల్లె పండుగ, గ్రామపంచాయతీ వారోత్సవాలతో గ్రామల్లో అభివృద్ధి వేగంగా జరుగుతుందన్నారు. రహదారుల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.వేల కోట్లు కేటాయించిందన్నారు. ఎన్డీఏ ప్రభుత్వ హయాంలో నాణ్యతతో రహదారుల పనులు జరుగుతున్నాయన్నారు. వైసీపీ హయాంలో రోడ్లన్నీ గుంతలుగా మారాయన్నారు. మాజీ ఎమ్మెల్సీ రుద్రరాజు పద్మరాజు, ఎంపీపీ కేతా శ్రీను, గుండుమోగుల పెదకాపు, మండల టీడీపీ అధ్యక్షుడు గుబ్బల శ్రీనివాస్, ప్రధానకార్యదర్శి చాగంటి స్వామి, గాలిదేవర వెంకన్నబాబు, మండల జనసేన అధ్యక్షుడు సూరిశెట్టి శ్రీనివాస్, వైస్ ఎంపీపీలు పొలమూరి శ్యామ్‌బాబు, ఇంటిపల్లి ఆనందరాజు, సర్పంచ్ చొప్పల గుణనాథ్, మాజీ సర్పంచ్ వడ్డి సత్యం, ఉలిశెట్టి లక్ష్మణరావు, వడ్లమూడి ప్రకాష్, చిన్ని, కొండేపూడి నారాయణరావు పాల్గొన్నారు.

రెవెన్యూ గ్రామసభల్లో భూసమస్యలు పరిష్కారం



మండపేట: మారేడుబాకలో జరిగిన రెవెన్యూగ్రామసభలో పాల్గొన్న జిల్లా సర్వే అధికారులు

మండపేట, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం రెవెన్యూ గ్రామసభలు నిర్వహిస్తుందని, వీటిని రైతులు సద్వినియోగం చేసుకుని భూ సమస్యలు పరిష్కరించుకోవాలని జిల్లా ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే అధికారి ఎం.శ్రీనివాస్ అన్నారు. శనివారం మారేడుబాక పంచాయతీ కార్యాలయంలో జరిగిన భూరిసర్వే పరిష్కారవేదిక గ్రామసభను జిల్లా సర్వే అధికారుల బృందం పరిశీలించింది. గ్రామసభలో 16మంది భూసమస్యలపై అధికారులకు ఫిర్యాదు చేశారు. మ్యూటేషన్‌కు సంబంధించి 2, భూముల కొలతల తేడాలపై 8, సర్వే నెంబర్ల తేడాలపై 3, సరిహద్దుల తేడాలపై 3 ఫిర్యాదులు వచ్చాయని డిప్యూటి తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. జిల్లా ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే అధికారి ఎన్.శ్రీనివాస్, రామచంద్రపురం డివిజన్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ ఎం.శ్రీనివాస్ తదితరులు గ్రామసభను సందర్శించి రైతుల నుంచి వచ్చిన ఫిర్యాదులు గురించి ఆరా తీశారు. జిల్లా వ్యాప్తంగా వచ్చే భూసమస్యలను పరిష్కరించేందుకు సత్వర చర్యలు తీసుకుంటామని వారు చెప్పారు. కార్యక్రమంలో ఆర్ఐ పి.వాసంతి, మండల సర్వేయర్ తోట కొండలరావు పంచాయతీ కార్యదర్శి, రెవెన్యుసిబ్బంది పాల్గొన్నారు.

గ్రామసభలో ఫిర్యాదుల వెల్లువ

ఉప్పలగుప్తం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): గతంలో భూ రీసర్వే చేసిన గ్రామాల్లో అభ్యంతరాల స్వీకరణకు రెవెన్యూ గ్రామభలు ప్రారంభమయ్యాయి. శనివారం సన్నవిల్లిలో తహసీల్దార్ పీఎస్ దివాకర్ అధ్యక్షతన జరిగిన గ్రామసభలో 40 ఫిర్యాదులందాయి. సరిహద్దు రైతుల భూమి విస్తీర్ణంలో రికార్డుల్లో పరస్పరం వ్యత్యాసాలపై అభ్యంతరాలున్నాయంటూ ఎక్కువ ఫిర్యాదులు అందినట్టు తేలింది. సర్పంచ్ చిక్కం జంగమయ్య, మండల సర్వేయర్ శేఖర్ పాల్గొన్నారు.

రీసర్వేతో సమస్యల పరిష్కారం

అంబాజీపేట, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ గ్రామసభల్లో భూసమస్యలు, సరిహద్దు వివాదాలను పరిష్కరిస్తామనితహసీల్దారు జె.వెంకటేశ్వరి సూచించారు. ముక్కామల రైతు సేవా కేంద్రంలో గ్రామసభ నిర్వహించారు. మండల సర్వేయర్ గీతా రమేష్, వీఆర్వో కోమలి, కనకమహాలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి కె.రామకృష్ణ, సర్వేయర్ సాయి, బండారు మల్లిబాబు, మానేపల్లి శ్రీనివాస్, వక్కలంక నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్ష



అధికారులతో సమీక్షిస్తున్న ఢిల్లీ ప్రతినిధి మల్లాడి

యానాం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): యానాంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులపై శాఖల వారీగా సమీక్షా సమావేశం నిర్వహించారు. స్థానిక పరిపాలనాధికారి కార్యాలయంలో జరిగిన సమావేశంలో పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేకప్రతినిధి మల్లాడి కృష్ణారావు హాజరయ్యారు. సీఎస్ఆర్ నిధులకు సంబంధించి 17అభివృద్ధి పనులపై చర్చించారు. 4రోజుల్లో వాటికి టెండర్లు పిలిచేలా చర్యలు తీసుకోవాలన్నారు. యానాం స్మార్ట్ పాఠశాలల ప్రతిపాదన మేరకు ఈనెల4న తీసుకున్న నిర్ణయం మేరకు ఏడు పాఠశాలల్లో ఐదు స్మార్ట్ క్లాస్ రూమ్స్ ఏర్పాటు చేసేందుకు చర్చించారు. యానాం, ఆంధ్ర సరిహద్దు ప్రాంతంలో ఉన్న సొసైటీ భూమి విషయంతో కోర్టు నుంచి వచ్చిన అనుమతి తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. భూహక్కుదారులు వెళ్లినప్పుడు ఎటువంటి గొడవలు జరగకుండా అధికారులు ఎస్సీ సొసైటీ సభ్యులకు న్యాయం చేయాలి కోరారు. యానాం రాజీవ్ బీచ్‌లో ఉన్న శివంహోలిబాత్ స్థానంలో రాతితో చేసిన శివలింగాన్ని ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని అధికారులు వివరించారు. ప్రజాపనుల శాఖ, రెవిన్యూ, ఎడ్యుకేషన్, మున్సిపాలిటీ, టౌన్ ప్లానింగ్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఇసుక విధానాన్ని పారదర్శకంగా నిర్వహించాలి



ఊబలంక ఇసుకర్యాంపును పరిశీలిస్తున్న కలెక్టర్

రావులపాలెం, అక్టోబరు19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఉచిత ఇసుక విధానాన్ని పారదర్శకంగా చేపట్టాలని స్థానిక అధికారులను జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఆదేశించారు. ఊబలంక ఇసుక రీచ్‌ను స్థానిక అధికారులతో కలిసి శనివారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గోదావరిలో నీరు తగ్గిన వెంటనే ఇసుక తవ్వకాలు చేపట్టాలన్నారు. ఇసుక లభ్యత, వాహనాల సరఫరా, ఆన్‌లైన్ ఆఫ్‌లైన్ ఇసుక బుకింగ్‌పై సిబ్బందికి అవగాహన కల్పించాలన్నారు. అనంతరం ఇసుక రీచ్ సరిహద్దులను గుర్తించి నిర్వహణపై పలు సూచనలు చేశారు. ఆర్డీవో శ్రీకర్, తహసీల్దారు బీఎం ముక్తేశ్వరరావు, జిల్లాగనుల శాఖ అధికారి అశోక్‌కుమార్, ఆర్ఐ సుజాత, రెవెన్యూసిబ్బంది పాల్గొన్నారు.

మందపల్లి శనేశ్వరస్వామి ఆదాయం రూ.1.55లక్షలు




శనేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు, బాలబాలాజీని దర్శించుకుంటున్న భక్తులు

కొత్తపేట, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మందపల్లి శనేశ్వర(మందేశ్వర) స్వామివారి ఆలయానికి శనివారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వేకువజాము నుంచే స్వామివారి సర్వదర్శనాలు, తైలాభిషేకాలకు క్యూ కట్టారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.వివిధ సేవల ద్వారాస్వామికి రూ.1,55,135 ఒక్కరోజు ఆదాయం వచ్చినట్లు సహాయ కమిషనరు నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.

బాలబాలాజీ ఆదాయం రూ.1.51లక్షలు

మామిడికుదురు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి బాలబాలజీ స్వామి కి శనివారం వివిధ ఆర్జిత సేవల ద్వారా ఆదాయం రూ.1,51,984 వచ్చిందని ఆలయ సహాయ కమిషనర్ సత్యనారాయణరాజు తెలిపారు. దేవస్థానం శనివారం భక్తులతో కిటకిటలాడింది. స్వామివారిని 2,900మంది భక్తులు దర్శించుకున్నారని, 1876 మంది స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు.

అన్నప్రసాద ట్రస్టుకు రూ.లక్ష విరాళం

అయినవిల్లి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): కాకినాడకు చెందిన నల్లం భానుకుమార్ శనివారం కుటుంబ సమేతంగా అయినవిల్లి శ్రీవిఘ్నేశ్వరస్వామివారినిదర్శించుకున్నారు. శ్రీవిఘ్నేశ్వర అన్నప్రసాద ట్రస్టుకు భానుకుమార్ రూ.1,01,116 విరాళం అందజేశారు. ఆలయ ప్రధానఅర్చకుల ఆధ్వర్యంలో దాతకు వేదఆశీర్వచనం అందజేశారు. స్వామివారి చిత్రపటాన్ని ఈవో అందించారు.

బుద్ధుని బోధనలు అనుసరణీయం

అమలాపురం టౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): గౌతమ బుద్ధుని బోధనలు ఆధునిక సమాజానికి ఎంతో అనుసరణీయమని అమలాపురం త్రిరత్న బుద్ధవిహార్ వ్యవస్థాప కుడు, మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు పేర్కొన్నారు. బౌద్ధ ధ్యాన కార్యక్రమంలో భాగంగా శనివారం బుద్ధవిహార్‌లో పలు కార్యక్రమాలు నిర్వహించారు. బౌద్ధ ప్రచారానికి ప్రతి ఒక్కరూ నడుంబిగించాలన్నారు. దీక్ష భూమిని సందర్శించిన వారికే భంతేజీని పంచశీల కండువాలతో సత్కరించారు. కార్యక్రమంలో బుద్ధవిహార్ అధ్యక్షుడు నాగాబత్తుల ప్రసాదరావు బీఎస్‌ఐ అధ్యక్షుడు కాశి రాంబోధి, ములపర్తి సత్యనారాయణ, ఈవీవీ సత్యనారాయణ, కాశి వెంకట్రావు, గోసంగి ఆనందరావు, జల్లి శ్రీనివాసరావు, బొంతు బాలయోగి తదితరులు పాల్గొన్నారు.


మోడల్ విలేజ్‌గా తీర్చిదిద్దుతా

అంతర్వేది, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మోరిపోడులో శనివారం పల్లెపండుగ వారోత్సవాల్లో భాగంగా ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ సీసీ రోడ్లకు భూమిపూజ చేశారు. కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రతీ గ్రామాన్ని మోడల్ విలేజ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పని చేస్తున్నామని ఎమ్మెల్యే అన్నారు. సర్పంచ్ ముప్పర్తి అలివేలు గంగాత్రివేణి, ఎంపీటీసీ బళ్ల సుభాషిణి, ఉపసర్పంచ్ కడలి శ్రీను, టీడీపీ మండల అధ్యక్షుడు ముప్పర్తి నాని, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

కార్యదర్శికి సత్కారం

అల్లవరం, అక్టోబరు19(ఆంధ్రజ్యోతి):దేవగుప్తం పంచాయతీ కార్యదర్శిగా పనిచేసి బదిలీ అయిన పిల్లి శ్రీనివాస్‌ను శనివారం మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు సాధనాల వెంకట్రావు సత్కరించారు. ఇన్‌చార్జికార్య దర్శి కుమారి, వీఆర్వో వీర్రాజు,సిబ్బందిపాల్గొన్నారు.

పేదలకు దుస్తుల పంపిణీ



ఉప్పలగుప్తం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉప్పలగుప్తం చిక్కం సత్తిరాజు అన్నదాన సత్రం వ్యవస్థాపకుడు చిక్కం సత్తిరాజు వర్ధంతిని గొల్లవిల్లిసీఏస్ఎం, ఎంఎస్ఎస్ కళాశాలల ఆవరణలో శనివారం నిర్వహించారు. సత్తిరాజు విగ్రహానికి పలువురు నివాళులర్పించారు. పేదలకు బియ్యం, దుస్తులు పంపిణీ చేశారు. కరస్పాండెంట్, కార్యదర్శి సీహెచ్‌వీవీఎస్‌వీ ప్రసాదరావు, సంయుక్త కార్యదర్శి పొత్తూరి వెంకటపతిరాజు, కోశాధికారి మోటూరి సుబ్రహ్మణ్యం, ప్రిన్సిపాల్ కంచుమర్తి బాలాజీ, చిక్కం పెద్దబ్బులు, చిక్కం బాలసుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

కళాశాల విద్యార్థిని ప్రతిభ

కాట్రేనికోన, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): అమలాపురంలో జరిగిన జిల్లా యూత్ ఫెస్టివల్‌లో చెయ్యేరు శ్రీశ్రీనివాసా ఇంజనీరింగు సీఎస్ఈ విద్యార్థిని ఎం.ప్రియాంక 3డి ప్రింటింగ్ అంశంపై ఉపన్యసించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసకుమార్ తెలిపారు.

సెయింట్ జోషఫ్ పాఠశాలలో కల్చరల్ ప్రోగ్రామ్స్

అంబాజీపేట, అక్టోబరు19(ఆంధ్రజ్యోతి): ఇరుసుమండ సెయింట్ జోషఫ్ ఇంగ్లీస్ మీడియం పాఠశాలలో జోనల్ కల్చరల్ మీట్ శనివారం జరిగింది. ఈ సందర్భంగా ప్రొవిషియల్ సిస్టర్ లిజాసబాస్టిన్, ఎడ్యుకేషనల్ కౌన్సిలర్ సిస్టర్ సనోటాల ఆధ్వర్యంలో జోనల్ కల్చరల్ ప్రోగ్రామ్స్ నిర్వహించారు. ఈసందర్భంగా పశ్చిమగోదావరి నుంచి సెయింట్ మేరీ, దెందులూరు సెయింట్ ప్రాన్సిస్, పోలవరం, ఇరుసుమండ నుంచి సెయింట్ జోషఫ్స్ ఇంగ్లీస్ మీడియం హైస్కూల్స్ పాల్గొన్నాయి. విద్యార్థులకు స్పీచ్, పాటలు, డ్యాన్స్ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా పాఠశాలల ప్రిన్సిపాల్స్, వైస్ ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అయినవిల్లిలో 67.6 మిల్లీమీటర్ల వర్షపాతం

అమలాపురంటౌన్, అక్టోబరు19(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సగటున 16.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదుకాగా అత్యధికంగా అయినవిల్లిలో 67.6 మిల్లీమీటర్లు, అత్యల్పంగా కాట్రేనికోనలో 0.6మిల్లీమీటర్లు నమోదైంది. మండలాల వారీగా ఆత్రేయపురం1, కొత్తపేట5.4, కపిలేశ్వరపురం 2, కె.గంగవరం, 20.4, ఐ.పోలవరం 33.6, ముమ్మిడివరం53.6, పి.గన్నవరం 13.8, అంబాజీపేట 30.6, మామిడికుదురు26.8, రాజోలు7.2, మలికిపురం 15.4, సఖినేటిపల్లి16.2, అల్లవరం4.6, ఉప్పలగుప్తం30.2, అమలాపురం 37.

అధ్వానంగా పుంత రోడ్లు.. ఇబ్బందుల్లో రైతులు

- వైసీపీ ప్రభుత్వంలో నిర్లక్ష్యం
- ఎరువులు తరలించడానికి ఇబ్బందులు

కె.గంగవరం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): రైతులు ఆరుగాలం శ్రమపడి పండించిన పంటలను పొలాల నుంచి తరలించుకోవడానికి ఉపయోగించే రహదారులు అధ్వానంగా ఉన్నాయి. వర్షాలకు పుంతరోడ్లు చిత్తడి చిత్తడిగా మారుతున్నాయి. వైసీపీ ప్రభుత్వం ఈరహదారులను తీవ్ర నిర్లక్ష్యం చేసింది. దీంతో ఇప్పుడు వానలకు రైతులు ఈరహదారుల మీదుగా వెళ్లాలంటే నరకం చూస్తున్నారు. ఈరహదారుల మీదుగా వెళ్లి పొలం పనులు చేసుకోసం వెళ్లడం, ఎరువులను తరలించు కోవడానికి చాలా ఇబ్బందులు


పామర్రులో పంట పొలాలకు వెళ్లే పుంత రోడ్లు

పడుతున్నామని రైతులు వాపోతున్నారు. పొలాల్లో ఎరువులు వేయడానికి సమీపంలో రోడ్డుపై కలుపుకుని చిన్న చిన్న మూటలు కట్టుకుని పొలాల దగ్గరకు నడిచి వెళ్లవలసి వస్తుంది. ఈపుంత రహదారులు అభివృద్ధి చేసివుంటే ప్రతీ రైతు పొలం వరకూ సైకిల్‌పై, బైక్‌పై ఎరు వుల బస్తాలు తరలించుకుని వెళ్లేందుకు వీలుగా ఉంటుంది. అదేవిధంగా పాడి రైతులు పొలాల వద్ద పాకలు ఏర్పాటు చేసుకుని పశువులను పెంచుకుంటారు. ఇప్పుడు వానలు కారణంగా ఆ పాకలు దగ్గరకు వెళ్లాలన్నా ఇబ్బందులు పడుతున్నామని రైతులు వాపోతున్నారు. గత వైసీపీ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యంగా వదిలివేడయంతో ఈపుంత రహదారులు నేడు చాలా అధ్వానంగా తయారయ్యాయి. మండలంలోని ప్రతీ గ్రామంలో పుంత రోడ్లు పరిస్థితి ఇదే విధంగా ఉంది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం పుంత రోడ్లను అభివృద్ధి చేయాలని రైతులు కోరుతున్నారు.

రైతుల ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం

- రెండు సైపాన్ల నిర్మాణానికి రూ.2.92కోట్లు నిధులు మంజూరు
- నిధుల మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే బండారుకు రైతులు, ప్రజాప్రతినిధుల కృతజ్ఞతలు

ఆత్రేయపురం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్లగా రైతుల పంట పొలాలకు ప్రకృతి వైపరీత్యాల కారణంగా ముంపు నీరు వెళ్లే మార్గం లేక చెరువులను తలపిస్తున్నాయి. ఆరుగాలం కష్టించి పంటను పండిస్తున్న రైతుకు ముంపు బెడద తరచూ పట్టి పీడిస్తుండడంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. ఎన్నో ఏళ్ల నుంచి ప్రజాప్రతినిధులు, ప్రభుత్వాలు ముంపు సమస్యను పరిష్కరించడంలో విఫలమయ్యారు. నష్టపోయిన రైతులు ప్రతీసారి రోడ్డెక్కి ఆందోళనలు చేపట్టినా పాలకులకు పట్టలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తి కావస్తుంది. రైతు సమస్యలను గుర్తించిన స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆ ప్రాంత రైతుల ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడంతో రైతుల ఆనందానికి అవధుల్లేవు. ఆత్రేయపురం మండలం లొల్ల, మెర్లపాలెం, వాడపల్లి గ్రామాల్లో 1500ఎకరాల ఆయకట్టులో రైతుల పంట పొలాలు వర్షాలు కురిస్తే చెరువులను తల


లొల్ల వద్ద చెరువును తలపిస్తున్న పంట పొలాలు(ఫైల్‌ఫొటో), ముంపు డ్రెయిన్లలో పూడిక తొలగించుకుంటున్న రైతులు(ఫైల్‌ఫొటో)

పిస్తున్నాయి. లొల్ల లాకుల నుంచి డెల్టా శివారు రైతులకు సాగునీరు అందించేందుకు సాగునీరు అందించే క్రమంలో కాల్వ మట్టాన్ని పెంచడం ద్వారా మూడు గ్రామాల పంట పొలాలు ముంపునకు గురవుతున్నాయి. ప్రతీ ఏటా రైతులకు ఈముంపు తప్పడం లేదు. స్థానిక రైతులు ముంపు డ్రెయిన్లను శుభ్రం చేసుకోవడం తాత్కాలిక ఉపశమనమే అవుతుంది. రైతు సమస్యను గుర్తించిన స్థానిక సర్పంచ్ కాయల జగన్నాథం, స్థానిక ఎమ్మెల్యే బండారు దృష్టికి తీసుకువెళ్లారు. సీఎం చంద్రబాబునాయుడు ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు దృష్టికి ఎమ్మెల్యే తీసుకువెళ్లారు. మెర్లపాలెం, ర్యాలీ దుర్గమ్మగుడి సమీపంలో సైపాన్లు నిర్మించి భూగర్భ డ్రైనేజీ ద్వారా ముంపునీరు తరలించేందుకు 2.92కోట్ల నిధులు ప్రభుత్వం మంజూరు చేసింది. నిధుల మంజూరుకు కృషిచేసిన ఎమ్మెల్యే బండారుకు రైతులు, ప్రజాప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నోఏళ్లుగా పట్టి పీడిస్తున్న ముంపు సమస్య ఎమ్మెల్యే కృషితో పరిష్కారమైంది.

రతన్ టాటాకు లారీ యూనియన్ నివాళి

రామచంద్రపురం(ద్రాక్షారామ), అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామికవేత్త రతన్ టాటాకు రామచంద్రపురం లారీ ఓనర్స్, వర్కర్స్ యూనియన్ నివాళి అర్పించింది. శనివారం లారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యాలయం వద్ద రతన్‌టాటా చిత్రపటానికి పూలమాలలువేసి అసోసియేషన్ అధ్యక్షుడు గన్నమని చక్రవర్తి నివాళులర్పించారు. ఆయన మృతి దేశానికి, రవాణా రంగానికి తీరని లోటని చక్రవర్తి అన్నారు. అధిక సంఖ్యలో లారీ యజమానులు, వర్కర్లు పాల్గొన్నారు.

వాకతిప్పలో ఉపాధి గ్రామసభ



కపిలేశ్వరపురం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): వాకతిప్ప, నాగులచెరువు గ్రామాల్లో సర్పంచ్‌లు కొరిపెల్ల వెంకటనాగస్రవంతి, వాసంశెట్టి సత్యనారాయణల అధ్యక్షతన శనివారం ఉపాధి హామీ గ్రామసభలు నిర్వహించారు. గ్రామసభల్లో వాకతిప్పలో రూ.60లక్షలతో 53పనులు, నాగులచెరువులో రూ.32లక్షలతో 40పనులు చేపట్టడానికి ఆమోదం తెలిపారు. కార్యక్రమాల్లో కార్యదర్శులు పి. వెంకటేశులు, ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీ రవికిరణ్, ఫీల్డ్ అసిస్టెంట్ టి.గణేష్, ఆర్‌డబ్ల్యుఎస్ జేఈ, టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్లు, సచివాలయం సిబ్బంది, డ్వాక్రా మహిళలు, ఉపాధి హామీ పథకం వేతనదారులు పాల్గొన్నారు.

కూటమితోనే పల్లెల్లో పండుగ


మెర్లపాలెంలో సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బండారు

ఆత్రేయపురం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): కూటమి పాలనలోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతూ పల్లెల్లో పండుగ కళ ఉట్టిపడుతుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. శనివారం పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా మెర్లపాలెం, లొల్ల, పేరవరం, బొబ్బర్లంక, నార్కెడుమిల్లి, అంకంపాలెం గ్రామాల్లో రూ.1.50కోట్లతోచేపడుతున్న అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే బండారు భూమిపూజ నిర్వహించి పనులకు శ్రీకారం చూట్టారు. ఉపాధి నిధులతో పల్లెలు ప్రగతి విప్లవం రానుందన్నారు. అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వం లక్ష్యమన్నారు.కార్యక్రమంలో టీడీపీ మండల అధ్య క్షుడు ముదునూరి వెంకట్రాజు, ముళ్ళపూడి భాస్కరరావు, మద్దూరి సుబ్బారావు, కుడప కృష్ణమూర్తి, జల్లి కామేశ్వర రావు, మద్దింశెట్టి సత్యనారాయణ, సర్పంచ్‌లు మెర్ల రాము, గంటి విజయభారతి, కాయల జగన్నాథం, నరాలశెట్టి సుబ్బలక్ష్మి, ముత్యాబత్తుల రాజు, తోటకూర సుబ్బరాజు, పాలంగి రవి చంద్ర, పెండెం వెంకన్న పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి గ్రామసభలు


దరఖాస్తు స్వీకరిస్తున్న తహసీల్దార్ చిన్నారావు

కపిలేశ్వరపురం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): భూసమస్యల పరిష్కారానికి ప్రభుత్వం గ్రామసభలు నిర్వహిస్తుందని, వాటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ చిన్నారావు అన్నారు. శనివారం కాలేరు పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామసర్పంచ్ దాయం కావేరి శేఖర్‌బాబు అధ్యక్షతన జరిగిన రెవెన్యూ గ్రామ సభలో ఆయన మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ రీసర్వే ప్రాజెక్టులో సర్వే పూర్తయిన గ్రామాల్లో వివిధ భూసమస్యల పరిష్కారానికి గ్రామసభలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. వివిధ సమస్యలపై రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఎంపీటీసీ టి.మంజుల కూటమి నాయకులు చుండ్రు రామకృష్ణ చౌదరి, పెయ్యల యాకోబు, కార్యదర్శి యు.సుప్రియ, వీఆర్‌వోలు, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మానవతా 33వ వార్షికోత్సవం

రాయవరం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): లొల్ల విశ్వమానవతా సంస్థ 33వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా మానవత ఆశ్రమంలో 108 సూర్య నమస్కారాల పోటీలు నిర్వహించారు. ఈపోటీల్లో లొల్ల, రాయవరం, మహేంద్రవాడ, కొంకుదురు, మాచవరం తదితర పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందజేసినట్టు సంస్థ వ్యవస్థాపకుడు అల్లూరి శ్రీనివాస చౌదరి చెప్పారు.

డిగ్రీ కళాశాల విద్యార్థుల ప్రతిభ

రామచంద్రపురం(ద్రాక్షారామ), అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ఇటీవల సెంట్రాజ్ అమలాపురంలో నిర్వహించిన యూత్ ఫెస్టివల్‌లో రామచంద్రపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనపరిచారు. లైవ్ ఇనుస్ట్రుమెంట్స్‌తో ప్రదర్శించిన గ్రూప్‌ఫోక్ సాంగ్‌కు ప్రథమ, గ్రూప్ ఫోక్ డ్యాన్స్‌కు ప్రథమ, సోలో ఫోక్ సాంగ్‌కు ప్రథమ, సోలోఫోక్ సాంగ్‌కు తృతీయస్థానాలు సాధించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. విద్యార్థినీ, విద్యార్థులను ప్రోత్సహించిన తెలుగు అధ్యాపకురాలు ఎస్.సుజాతను ప్రిన్సిపాల్ శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ పద్మజ అభినందించారు.

ఘనంగా అట్లతద్ది



కపిలేశ్వరపురం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో శనివారం మహిళలు అట్లతద్దిని ఘనంగా జరుపుకున్నారు. కాలువ రేవులు, గోదావరి పుష్కర ఘాట్లు మహిళలతో కళకళలాడాయి. మహిళలు వరి కంకులు, మంత్ర పుష్పాలతో గౌరీమాతకు, తులసి మాతకు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఉపవాసం ఉండి మహిళలకు అట్లవాయినం సమర్పించి ఉయ్యాల ఊగారు. గోమాతకు పూజలు చేశారు. గ్రామాల్లోని అమ్మవార్ల ఆలయాలను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

ఇసుక రీచ్‌లను పరిశీలించిన జేసీ


పులిదిండి ఇసుక ర్యాంపును పరిశీలించిన జేసీ నిషాంతి

ఆత్రేయపురం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఉచిత ఇసుకను అందించేందుకు చర్యలు చేపడుతుంది. శనివారం ఆత్రేయపురం, పులిదిండి, వద్దిపర్రు ఇసుక రీచ్‌లను జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి పరిశీలించారు. ఆయా రీచ్‌ల్లో జియో కోఆర్డినేషన్ చేసిన ప్రదేశాన్ని పరిశీలించారు. స్టాక్ పాయింట్ల కోసం నిర్ధారించిన ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు. స్టాక్ పాయింట్ వద్ద సీసీ కెమెరాలు, రహదారి బాటలపై సిబ్బందిని అడిగి తెలుసుకునారు. ఆమె వెంట ఇరిగేషన్ ఈఈ కాశీవిశ్వేశ్వరరావు, మైనింగ్ ఏడీ అశోక్‌కుమార్, తహసీల్దారు రాజేశ్వరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సోమేశ్వరంలో పల్లె పండుగ


అభివృద్ధి పనులకు భూమిపూజ చేసిన కూటమి నాయకులు

రాయవరం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): సోమేశ్వరంలో శనివారం పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో పిల్లి వెంకట రమణకు చెందిన గోకులాన్ని, మెయిన్ పాఠశాలలో ఆర్వోప్లాంట్‌కు ఎంపీడీవో భూమి పూజ చేశారు. ఈసందర్భంగా3 టీడీపీ సీనియర్ నాయకుడు, అమలాపురం పార్లమెంట్ పార్టీ ఉపాధ్యక్షుడు వైఆర్‌కే పరమహంస మాట్లాడుతూ ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు కృషితో తొమ్మిది గోకులాల షెడ్లు మంజూరయ్యాయన్నారు. వీటికి రూ.17 లక్షలు ఖర్చు చేయనున్నట్లు చెప్పారు. ఆర్వోప్లాంటుకు రూ.5 లక్షలు ఖర్చు అవుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ చైతన్యకుమారి, కూటమి నాయకులు శాఖ కోటేశ్వర రావు, దుర్గాప్రసాద్, కనకాల అప్పారావు, కడియాల వెంకటరమణ, సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి వెంక టరత్నం తదితరులు పాల్గొన్నారు.

కార్యదర్శికి సత్కారం

అల్లవరం, అక్టోబరు19(ఆంధ్రజ్యోతి):దేవగు ప్తం పంచాయతీ కార్యదర్శిగా పనిచేసి బదిలీ అయిన పిల్లి శ్రీనివాస్‌ను శనివారం మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు సాధనాల వెంకట్రావు సత్కరించారు.


ఉపాధి గ్రామసభలో మాట్లాడుతున్న టెక్నికల్ అసిస్టెంట్ దుర్గాప్రసాద్

పాణింగపల్లిలో 41 పనుల గుర్తింపు

కె.గంగవరం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాణింగపల్లి గ్రామంలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో 41 పనులు చేయడానికి గుర్తించినట్టు సర్పంచ్ చీకట్ల సునీత చెప్పారు. శనివారం ఆమె అధ్యక్షతన ఉపాధి పనుల గుర్తింపు కోసం గ్రామసభ నిర్వహించారు. కార్యక్రమంలో కార్యదర్శి ఎం.సీతా రామయ్య, టీడీపీ నాయకుడు బలుసు నాగేంద్ర, ఎన్‌ఆర్‌ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్ ఎ.దుర్గాప్రసాద్, ఫీల్డ్ అసిస్టెంట్ రాజు తదితరులు పాల్గొన్నారు.

హసన్‌బాద, ఉండూరులో పల్లెపండుగ


రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న

ద్రాక్షారామ, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): హసన్‌బాద, ఉండూరు, బీమక్రోసుపాలెం గ్రామాల్లో శనివారం పల్లె పండుగ నిర్వహించారు. హసన్‌బాదలో సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు ఆధ్వర్యంలో పల్లె పండుగ జరిగింది. కార్యక్రమంలో సీసీ రోడ్ల నిర్మాణానికి ఎంపీడీవో పద్మజ్యోతి, మంత్రి సుభాష్ తండ్రి సత్యం, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ చింతపల్లి వీరభద్రరావు శంకుస్థాపన చేశారు. ఉండూరులో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ చిగురుపాటి రామలక్ష్మి, మంత్రి సుభాష్ తండ్రి సత్యం సీసీ రోడ్డు, డ్రైన్ కమ్ రోడ్డు నిర్మాణాలకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఏఈ ఏసురత్నం, టీడీపీ నాయకులు టేకుమూడి సత్యనారాయణ, కె.సత్యనారాయణ, చిగురుపాటి సాయి తదితరులు పాల్గొన్నారు.

శివల, శేరిలంక గ్రామాల్లో..

కె.గంగవరం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శివల, శేరిలంక గ్రామాల్లో శనివారం 'పల్లె పండుగ నిర్వహించారు. శివలలో రెండు సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ అనసూరి సాయి, ఎంపీటీసీ వాసంశెట్టి నాగమణి, టీడీపీ నాయకులు నిడదవోలు సుబ్రహ్మణ్యం, బలుసు శివప్రసాద్, వాసంశెట్టి కృష్ణ తదితరులు పాల్గొన్నారు. శేరిలంకలోనూ అభివృద్ధి పనులకు భూమిపూజ చేయగా కొండేపూడి భద్రరావు తదితరులు పాల్గొన్నారు.


శివలలో భూమిపూజ చేస్తున్న టీడీపీ నాయకులు

ఏజీపీగా పద్మకమలకుమారి



రామచంద్రపురం(ద్రాక్షారామ), అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సహాయ న్యాయవాదిగా సీనియర్ న్యాయవాదిలకాని పద్మ కమలకుమారి నియమితులయ్యారు. దీనిపై కలెక్టరు ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆమె తెలిపారు. 2012లో కూడా ఆమె ఏజీపీగా సేవలందించారు. మున్సిపల్ కౌన్సిలర్‌గా, టెలికం అడ్వైజరీ బోర్డు సభ్యురాలిగా, కృత్తివెంటి పేర్రాజు పంతులు ఎడ్యుకేషనల్ ట్రస్టు సభ్యురాలిగా పదవులు చేపట్టారు. ఈసందర్భంగా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి సుభాష్‌కు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఆమెను పలువురు న్యాయవాదులు, కూటమి పార్టీ నాయకులు అభినందించారు.


ఉచిత హోమియో వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

అర్తమూరులో ఉచిత హోమియో వైద్య శిబిరం

మండపేట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) అర్తమూరుకు చెందిన ఎస్‌బీఎస్‌ఆర్ చారిటబుల్ ట్రస్టు సేవా కార్యక్రమాలు అభినందనీయమని రాయవరం యూనియన్ బ్యాంకు మేనేజర్ ప్రదీప్ అన్నారు. అర్తమూరులో ట్రస్టు ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన 176 హోమియో ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ట్రస్టీ సత్తి బుల్లిస్వామిరెడ్డి చేస్తున్న సేవా కార్యక్రమాలను ఆయన ప్రశంసించారు. రాజమహేంద్రవరం అల్లు రామలింగయ్య హోమియో వైద్యుడు తమ వైద్య సేవలను రోగులకు అందించారు. శిబిరంలో 270 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు కేజయా, శృతికాత్యాయిని, ట్రస్టు వైస్ చైర్మన్ సత్తి లక్ష్మణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఆలమూరు మండలం పినపళ్లలో కాలువ వద్ద గౌరిదేవి పూజలు చేస్తున్న మహిళలు. పక్క చిత్రంలో కొత్తూరులో కాలువ వద్ద మహిళల పూజలు

భక్తి శ్రద్ధలతో అట్లతద్ది పూజలు

ఆలమూరు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలో పలు గ్రామాల్లో అట్లతద్దిని మహిళలు భక్తి శ్రద్ధలతో జరిపారు. తెల్లవారుజామున ఆహారాన్ని తీసుకుని సాయంత్రం వరకు యువతులు, ముత్తైదువులు ఉపవాసం చేశారు. సాయంత్రం వేళ సమీపంలోని కాలువలు, చెరువుల్లో గౌరిదేవి పూజ చేశారు. సాయంత్రం చంద్రుడిని చూసి ఉపవాస దీక్షను విరమించారు. యువతులు సంప్రదాయ దుస్తులు ధరించి సందడి చేశారు. మండలంలోని పలు గ్రామాల్లో ఉయ్యాలలు ఏర్పాటు చేసి యువతులు, మహిళలు ఉయ్యాలలూగారు.

ద్రాక్షారామ: రామచంద్రపురం మండలంతో పాటు, పట్టణంలో శనివారం అట్లతద్ది వేడుకను మహిళలు సంప్రదాయబద్ధంగా జరిపారు. తెల్లవారుజాము నుంచే యువతులు, మహిళలు ఎంతో నిష్ఠగా ఉపవాసంతో గడిపారు. గౌరీదేవికి అట్లు వాయనంగా ఉంచి పూజలు చేశారు. సాయంత్రం సమీపంలోని కాలువల వద్దకు వెళ్లి గౌరీపూజ చేశారు. మండలంలోని సప్తగోదావరి, రామచంద్రపురం పట్టణంలో వెల్ల కాలువ, కొత్తూరు కాలువ వద్ద పలువురు మహిళలు పూజలు చేశారు. యువతులు సంప్రదాయ దుస్తులు ధరించి సందడి చేశారు.


విలాస గంగవరం సభలో మాట్లాడుతున్న తహశీల్దార్ మృత్యుంజయరావు. పక్క చిత్రంలో ఆలమూరు మండలం కలవచర్ల రెవెన్యూ సదస్సులో ఫిర్యాదులు తీసుకుంటున్న తహశీల్దార్ ప్రకాష్‌బాబు

రెవెన్యూ గ్రామసభలను సద్వినియోగం చేసుకోండి

కె.గంగవరం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): భూముల రీ సర్వేలో తలెత్తిన సమస్యల పరిష్కారానికి రెవెన్యూ గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ బండి మృత్యుంజయరావు కోరారు. విలస గంగవరంలో శనివారం జరిగిన సభలో ఆయన సమస్యలున్న రైతుల నుంచి దరఖాస్తులు తీసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పంపన నాగమణి, వైస్ ఎంపీపీ దూడల నాగేశ్వరరావు, డిప్యూటీ తహశీల్దారు మురళి, ఆర్ఐ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులు ప్రారంభం

ఆలమూరు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ కె.జె.ప్రకాష్‌బాబు కోరారు. కలవచర్లలో శనివారం సర్పంచ్ వడ్డి వెంకన్న అధ్యక్షత జరిగిన సదస్సులో తహశీల్దార్ మాట్లాడారు. రెవెన్యూ రికార్డులు, సర్వేలు తదితర అంశాలపై అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులకు ప్రయోజనం చేయాలనే లక్ష్యంతో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. భూసంబంధిత రికార్డులను సవరించుకోవడానికి ఈ సదస్సులు ఉపయోగపడతాయన్నారు. రైతుల నుంచి పలు రెవెన్యూ ఫిర్యాదులు తీసుకున్నారు. నిర్ణీత సమయంలో వాటిని పరిష్కరిస్తామని ఆయన అన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వేణు, రెవెన్యూ అధికారిని రావయమ్మ, పలువురు వీఆర్వోలు పాల్గొన్నారు.

పేకేరులో ఉపాధి పనుల తనిఖీ

కె.గంగవరం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని పేకేరు గ్రామంలో శనివారం నేషనల్ లెవెల్ మోనిటరింగ్ బృందం సభ్యులు సల్మాన్, తిలక్‌లు ఉపాధి హామీ పథకం పనులను తనిఖీ చేశారు. గత ఆర్థిక సంవత్సరం నుంచి జరిగిన పనులు, వాటి రికార్డులను పరిశీలించారు. ఫీల్డ్‌లో పనులు, వాటి వివరాలు తెలిపే బోర్డులను వారు తనిఖీ చేశారు. రికార్డుల నిర్వహణ తదితర పలు అంశాలపై అన్ని చర్యలు తీసుకోవాలని వారు సూచించారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీఏ గణపతి, ఈసీ సాగర్ సిబ్బందితో కలిసి వారికి కావల్సిన వివరాలను తెలిపారు.


పేకేరులో ఉపాధి పనులు తనిఖీ చేస్తున్న ఎన్‌ఎల్‌ఎం టీం సభ్యులు